



ప్రమాదకరంగా ఉన్న హోర్డింగ్



దెబ్బతిన్న రోడ్డు

నిలిచిన ఆర్వోబీ పనులు

● భూసేకరణలో జాప్యంతో అంతరాయం ● గేటు పడితే ట్రాఫిక్‌కు అంతరాయం
● వాహనదారులకు తీవ్ర ఇబ్బందులు

కరీంనగర్ రూరల్, మే 16: కరీంనగర్ రైల్వే స్టేషన్ సమీపంలో లక్సెట్టిపేటరహదారిపై నిర్మాణంలో ఉన్న రైల్వే ఓవర్ బ్రిడ్జి పనులు నిలిచిపోయాయి. గతంలో రైల్వే గేటు పడినప్పుడు మాత్రమే ట్రాఫిక్‌జామ్ అయ్యేది. ప్రస్తుతం బ్రిడ్జి నిర్మాణ పనులు చేపట్టగా ఉన్న రహదారి చెడిపోయింది. దుమ్ము, ధూళితోపాటు రహదారిపై గుంతలు పడి వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

● పలు కారణాలు

కరీంనగర్ రైల్వే స్టేషన్ వద్ద నూతనంగా రైల్వే ఓవర్ బ్రిడ్జి నిర్మాణానికి గాను కేంద్ర ప్రభుత్వం 154 కోట్ల రూపాయలు మంజూరు చేసింది. గత ఆగస్టులో రైల్వే ఓవర్ బ్రిడ్జి నిర్మాణ పనులను ప్రారంభించారు. రెండు నెలల నుంచి పనులు నిలిచి పోయాయి. రైల్వే గేటు వద్ద డిజైన్ ఇప్పటి వరకు కాంట్రాక్టర్‌కు అందలేదని తెలిసింది. స్లాబ్ డిజైన్ కూడా ఆర్ అండ్‌బీ అధికారులు, రైల్వే శాఖ నుంచి రాలేదని సమాచారం. చేసిన పనులకు కూడా బిల్లులు రాలేదని కాంట్రాక్టర్ అంటున్నాడు.



భూసేకరణ, విద్యుత్ స్తంభాల షిఫ్టింగ్ అయితే రైల్వే బ్రిడ్జి పనులు స్పీడ్ అందుకుంటాయి. సర్వీస్ రోడ్డు వేస్తే తప్ప పనులు సజావుగా సాగవు. ఇవన్నీ పూర్తి కావాలంటే సంబంధిత అధికారులు చొరవ తీసుకోవల్సిన అవసరం ఉంది. రైల్వే ఓవర్ బ్రిడ్జి నిర్మాణంలో భాగంగా రెండు వైపులా నాలుగు వరుసల ఫ్లైఓవర్ నిర్మించాల్సి ఉన్నది. నాలుగు వరుసల రైల్వే వంతెన నిర్మాణంలో భాగంగా ఒక వైపు రెండు వరుసల నిర్మాణాన్ని చేపట్టారు. చొప్పదండి వైపు ఏడు, కరీంనగర్ వైపు ఎనిమిది పిల్లర్లు నిర్మిస్తున్నారు. రెండు వైపులా వంతెన నిర్మాణం పిల్లర్ల దశలోనే నిలిపివేశారు. వచ్చే మార్చి నాటికి పనులు పూర్తి చేయాలని ఆదేశాలు ఉన్నాయి. దీంతో రైల్వే గేటు వద్దవాహనదారులకు ఇబ్బందులు తప్పడం లేదు. రైల్వే ఓవర్ బ్రిడ్జి నిర్మాణానికి ముందే వాహనదారులకు రైల్వే గేటును దాటాలంటే వాహనదారులకు నరక ప్రాయంగా మారుతున్నది. వాహనదారులు గేటును దాటాలంటే గంటల సమయం పడుతున్నది.

● వేలాది వాహనాల రాకపోకలు

కరీంనగర్ నుంచి లక్సెట్టిపేట, ధర్మారం, చొప్పదండి ప్రాంతాలకు వెళ్లాల్సిన వాహనాలు ఈ గేటు మీదుగానే వెళతాయి. ప్రధాన రహదారిలో ఉన్న మాతా మాణి కేశ్వర ఆలయం నుంచి అపోలో రీచ్ ఆసుపత్రి వరకు ఒకవైపు పూర్తిగా పనులను చేపట్టగా మరో వైపు ఇరుకుగా మారిన రహదారిపై రెండు వైపులా వచ్చే వాహనాలతో రద్దీ తీవ్రమైంది. ప్రతి రోజు అనేక సార్లు ట్రాఫిక్ జామ్ ఏర్పడుతున్నది. దూర ప్రాంతాల నుంచి అంబులెన్స్‌ల్లో కరీంనగర్ వచ్చే రోగుల పరిస్థితి దయనీయంగా మారుతున్నది. రోజు పదుల సంఖ్యలో రైళ్లు ఈ గేటు మీదుగా వెళతాయి. ఆ సమయంలో గేటు పడడంతో ఎమర్జెన్సీ సర్వీసులకు ఆటంకాలు ఎదురవుతున్నాయి.



పిల్లర్స్ దశలోనే నిలిచిన పనులు, గేటు పడడంతో నిలిచిపోయిన వాహనాలు

హోర్డింగులు ఎంత భద్రం

● కాలం చెల్లిన బోర్డులతో పొంచి ఉన్న ప్రమాదం
● భయాందోళనలో ప్రజలు

కరీంనగర్ టౌన్, మే 16: నగరంలో ఎక్కడ చూసినా ప్రచార బోర్డులు దర్శనమిస్తున్నాయి. భారీ హోర్డింగ్‌లు, క్యాంటీలివర్స్ డివైడర్ల మధ్య గ్లోసైన్‌బోర్డులు ఇష్టారాజ్యంగా ఏర్పాటు చేశారు. ప్రచారానికి విద్య, వైద్యంతోపాటు కార్పొరేట్ కంపెనీలు, ఇతర వ్యాపారస్తులు, రాజకీయ పార్టీలు ప్రాధాన్యం ఇస్తుండడంతో ప్రచారబోర్డులు రోజు రోజుకు పెరుగుతున్నాయి. నిబంధనల మేరకు హోర్డింగ్‌లు ఏర్పాటు చేయడం లేదని, అనుమతి లేకుండా బోర్డులు ఏర్పాటు చేసి నగరపాలక సంస్థ ఆదాయానికి గండి కొడుతున్నారని విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. మరోవైపు చాలా ఏళ్ల క్రితం బహుళ అంతస్తుల భవనాలపై ఏర్పాటు చేసిన హోర్డింగ్ బోర్డులు ప్రమాదకరంగా మారాయి. గతంలో కరీంనగర్ బస్టాండ్ సమీపంలో ఏర్పాటు చేసిన భారీ స్వాగత బోర్డు కటౌట్లు ఊడిపోయి దాని కింది నుండి వె ళ్లిన ఆటోపై పడటంతో ఆటో డ్రైవర్ మృతి చెందాడు. గాలి దుమారంతో భారీ వర్షం పడినప్పుడల్లా హోర్డింగ్‌లపై ఏర్పాటు చేసిన ఫ్లెక్సీ లు, బోర్డులు చిరిగిపోయి రోడ్లపై వెళ్లే వారిపై పడటం వంటి సంఘటనలు జరిగాయి. తాజాగా ముంబాయిలో కురిసిన భారీ వర్షానికి అతిపెద్ద హోర్డింగ్ బోర్డు పెట్రోల్ బంక్‌పై పడటంతో 16 మంది మృతిచెందడమే కాకుండా పదుల సంఖ్యలో వాహనాలు దెబ్బతిన్నాయి. ఎంతో మంది గాయాలపాలయ్యారు. ఈ నేపథ్యంలో కరీంనగర్‌లో ఇష్టారాజ్యంగా ఏర్పాటు చేసిన బోర్డులు భద్రమేనా అనే భయాందోళనలు వ్యక్తమవుతున్నాయి.

● నిబంధనలు పాటిస్తున్నారా?

నగరపాలక సంస్థకు ప్రచార బోర్డుల ద్వారా భారీ ఆదాయం వస్తోంది. ఈ హోర్డింగ్‌లను నిబంధనల మేరకు ఏర్పాటు చేయాల్సిన అవసరముంది. వాటిని పట్టించుకోవడం లేదని, కొన్ని బోర్డులకు మాత్రమే అనుమతి తీసుకొని ఎక్కువ బోర్డులను ఏర్పాటు చేస్తున్నారని, సైజుల్లో కూడా తేడా చూపుతున్నారనే విమర్శలు ఉన్నావి. గతంలో ఇలాంటి వాటికి చెక్ పెట్టేందుకు ప్రతి హోర్డింగ్ బోర్డుకు సీరియల్ నం బర్‌తోపాటు అనుమతి తీసుకున్న సైజుల వివరా లను, సంబంధిత యాడ్ ఏజెన్సీల పేర్లు, ఇంటి యజమానితో తీసుకున్న లీజు అగ్రిమెంట్ తదితర వివరా లను పొందు పరచాలని నగరపాలక సంస్థ పాలక వర్గం నిర్ణయం తీసుకుంది. ఈ నిబంధనను కొద్దిరోజులు పాటించి ఆ తర్వాత కాగితాలకే పరిమితం చేశారు. ప్రస్తుతం నగరపాలక సంస్థ నుంచి అనుమతి తీసుకున్న ప్రభుత్వ, ప్రైవేట్ ఇళ్లు, భవనాలపై ఏర్పాటు చేసిన హోర్డింగ్ బోర్డులు 225 ఉండగా, 132 క్యాంటిలివర్స్, నాలుగు యునిపోల్స్ ఉన్నాయి. అనుమతి లేకుండా, నిబంధనలకు విరుద్ధంగా ఏర్పాటు చేసిన హోర్డింగ్ బోర్డులు మరో 50 నుంచి 100 వరకు ఉంటాయి. మొత్తంగా నాలుగు వందలకు పైగా ఉన్న భారీ హోర్డింగ్‌లు, గ్లోసైన్ బోర్డుల్లో కొన్ని చాలా రోజుల క్రితం ఏర్పాటు చేయడంతో అవి తుప్పుపట్టాయి. అవి భారీగా గాలివాన వస్తే కూలిపోతాయని, అధి కారులు వాటిపై దృష్టిపెట్టాలని నగర ప్రజలు కోరుతు న్నారు. నగరపాలక సంస్థ టౌన్‌ప్లానింగ్ అధికారులు ఈనెల 8న 32 యాడ్ ఏజెన్సీలకు నిర్మాణ స్థిరత్వ ధ్రువీకరణ పత్రాలను వారం రోజుల్లో సమర్పించాలంటూ నోటీసులు జారీ చేశారు.





డెంగ్యూ నివారణ ప్రతీ ఒక్కరి బాధ్యత

డీఎంహెచ్‌వో డాక్టర్ సుజాత

సుభాష్‌నగర్, మే 16: డెంగ్యూ నివారణ ప్రతీ ఒక్కరి బాధ్యత అని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ సుజాత అన్నారు. గురువారం జాతీయ డెంగ్యూ నివారణ దినోత్సవాన్ని పురస్కరించుకుని జిల్లా కేంద్రంలోని బుట్టి రాజారాం కాలనీ నుంచి ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ డెంగ్యూ వ్యాధి ఏడిస్ దోమ కాటు వల్ల వస్తుందన్నారు. తీవ్రమైన తలనొప్పి, జ్వరం, శరీరంపై దద్దుర్లు, కండరాల నొప్పులు, కీళ్లనొప్పులు, రక్తస్రావం డెంగ్యూ లక్షణాలన్నారు. కూలర్లు, పాత టైర్లు, ప్లాస్టిక్ వస్తువులు, కొబ్బరి బొండాలు, పూలతొట్లలో నిల్వ ఉన్న నీటిలో దోమలు పెరుగుతాయన్నారు. ప్రజలు తమ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. ప్రతి శుక్రవారం డ్రైడే పాటించాలన్నారు. గత సంవత్సరం 200 డెంగ్యూ కేసులు నిర్ధారణ అయినట్లు తెలిపారు.

ఈ సంవత్సరం ఇప్పటి వరకు 23 కేసులు నిర్ధారణ అయ్యా యన్నారు. వర్షాకాలంలో నీరు నిల్వ ఉండకుండా ప్రజలు తగు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా మలేరియా అధికారి డాక్టర్ రాజగోపాల్, డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ జువైరియా, డీఐవో డాక్టర్ సాజిద అతహరి, రంగారెడ్డి, కైక, నాగేశ్వర్‌రావు, ఎం రామనాథం, ఎ మల్లయ్య, లింగయ్య, సంతోష్, లక్ష్మి పాల్గొన్నారు.



ర్యాలిని ప్రారంభిస్తున్న డీఎంహెచ్‌వో డాక్టర్ సుజాత

రైతులకిచ్చిన హామీలను అమలు చేయాలి

బీఆర్ఎస్ ఆధ్వర్యంలో నిరసన

కరీంనగర్ టౌన్, మే 16: అసెంబ్లీ ఎన్నికల సమయంలో రైతులకు రెండు లక్షల రుణ మాఫీ చేస్తామని, క్వింటాల్ ధాన్యానికి రూ.500 బోనస్ ఇస్తామని ఇచ్చిన హామీలను కాంగ్రెస్ ప్రభుత్వం వెంటనే అమలు చేయాలని బీఆర్ఎస్ పార్టీ డిమాండ్ చేసింది. గురువారం బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర కమిటీ ఇచ్చిన పిలుపు మేరకు కరీంనగర్, హుజూరాబాద్, మానకొండూర్, చొప్పదండి నియోజకవర్గ కేంద్రాల్లో బీఆర్ఎస్‌శ్రేణులు రెండు గంటలపాటు నిరసన కార్యక్ర మాన్ని చేపట్టి అధికారులకు వినతిపత్రాలను అందజేశారు. కరీంనగర్‌లో నిర్వహించిన నిరసన కార్యక్రమంలో ఎమ్మెల్యే గంగుల కమలాకర్ మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిననాటి నుంచి రైతు వ్యతిరేక విధానా లను అవలంభిస్తోందని విమర్శించారు.



ధర్నాలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే గంగుల కమలాకర్

ఎన్నికల ముందు ఇచ్చిన హామీ మేరకు ధాన్యం కొనుగోళ్లు పూర్తి చేసి, అన్ని రకాల ధాన్యానికి క్వింటాల్‌కు 500 రూపాయల బోనస్ చెల్లించాలని డిమాండ్ చేశారు. పార్లమెంట్ ఎన్నికలు ముగియగానే సీఎం రేవంత్‌రెడ్డి మాట మార్చాడని, సన్న రకానికే 500 రూపాయల బోనస్ ఇస్తామనడం రైతులను మోసం చేయడమేనని విమర్శించారు. కొనుగోలు కేంద్రాల్లో సన్న వడ్లను గుర్తించే విధానం లేదని, ధాన్యం కొనుగోళ్ల చివరి దశకు వచ్చినా ఇప్పటి వరకు 33 లక్షల టన్నులే కొనుగోలు చేశారన్నారు. ప్రభుత్వ నిర్లక్ష్యంతోనే ధాన్యం కొనుగోళ్లలో జాప్యం జరుగుతోందన్నారు. తెలంగాణలో పంట దిగుబడి తగ్గిందా లేకుంటే రైతులు ప్రైవేట్‌కు అమ్ముకున్నారా.. ప్రభుత్వం ప్రకటన చేయాలని డిమాండ్ చేశారు.

అకాల వర్షంతో అన్నదాతలు అల్లాడిపోతున్నారని, తడిసి న ధాన్యాన్ని వెంటనే కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. లేకపోతే రైతు ఆగ్రహం చవిచూడక తప్పదని ఎమ్మెల్యే కమలాకర్ హెచ్చరించారు. హుజూరాబాద్‌లో ఎమ్మెల్యే పాడికౌశిక్‌రెడ్డి తన నివాసంలో రైతులు, బీఆర్ఎస్ శ్రేణులతో కలిసి నిరసన ధర్నా కార్యక్రమాన్ని చేపట్టి రైతులకు ఇచ్చిన హామీ నెరవేర్చడంలో కాంగ్రెస్ ప్రభుత్వం వైఫల్యం చెందిందని విమర్శించారు.

మానకొండూర్ మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయం ఎదుట మాజీ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ నాయకుడు రసమయి బాలకిషన్ ఆధ్వర్యంలో బీఆర్ఎస్‌శ్రేణులు, రైతులు నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. అనంతరం రైతులకు కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలన్నిటిని వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేస్తూ నాయబ్ తహసీల్దార్‌కు వినతిపత్రం సమర్పించారు. చొప్పదండిలో బీఆర్ఎస్ కార్యాలయం ముందు మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్, నియోజకవర్గ ప్రజాప్రతి నిధులు, నాయకులు, రైతులు, కార్యకర్తలతో కలిసి రైతాంగ సమస్యలను వెంటనే పరిష్కరించాలని, రైతులకు ఇచ్చిన హామీలను రేవంత్‌రెడ్డి సర్కార్ అమలు చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం ఆయన తహీసల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. కరీంనగర్‌లో నిర్వహించిన కార్యక్రమంలో మేయర్ యాదగిరి సునీల్‌రావు, బీఆర్ఎస్ నగర అధ్యక్షుడు చల్ల హరిశంకర్, కార్పొరేటర్లు పాల్గొన్నారు.

రైతులకు ఆధునిక పద్ధతులపై అవగాహన కల్పించాలి

కరీంనగర్, మే 16 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): వ్యవసాయ రంగంలో ఆధునిక పద్ధతులపై వ్యవసాయ శాస్త్రవేత్తలు, అధికారులు రైతులకు అవగాహన కల్పించాలని కలెక్టర్ పమేలా సత్పతి సూచించారు. కృషి విజ్ఞాన కేంద్రం స్వర్ణోత్సవాలను పురస్కరించుకుని ఢిల్లీలోని భారతీయ వ్యవసాయ పరిశోధన మండలి నుంచి తీసుకువచ్చిన టార్చ్‌ను వ్యవసాయ శాస్త్రవేత్తలు, వ్యవసాయ అధికారులు కలెక్టర్‌కు అందజేశారు. ఈ సందర్భంగా వారిని కలెక్టర్ అభినందించారు.

అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ కృషి విజ్ఞాన కేంద్రాలు ప్రారంభమై 50 సంవత్సరాలు అవుతున్నదన్నారు. ఈ మేరకు స్వర్ణోత్సవాలను పురస్కరించుకొని ఢిల్లీ నుంచి వచ్చిన టార్చ్‌ను అధికారుల పరిశీలన కోసం వివిధ జిల్లాలకు తీసుకెళ్తున్నారని తెలిపారు. శాస్త్రవేత్తలు, అధికారులు సేంద్రియ వ్యవసాయంపై రైతులకు అవగాహన కల్పిస్తూ ప్రోత్సహించాలన్నారు. రైతులు నష్టపోకుండా చూడాల్సిన బాధ్యత అందరిపై ఉందని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ అధికారి శ్రీనివాస్, కేవీకే ప్రధాన కార్యదర్శి విజయ్ గోపాల్‌రెడ్డి, కేవీకే సీనియర్ శాస్త్రవేత్త వెంక టేశ్వర్‌రావు, ఏడీఏ రణధీర్‌రెడ్డి, శాస్త్రవేత్తలు ప్రభాకర్, ప్రశాంతి, విజయ్, వేణుగోపాల్, మహేష్, శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు.



కలెక్టర్‌కు టార్చ్‌ను అందజేస్తున్న వ్యవసాయ శాస్త్రవేత్తలు, అధికారులు

పిల్లల దత్తత కోసం సంక్షేమాధికారి కార్యాలయంలో సంప్రదించాలి

కరీంనగర్ టౌన్: కరీంనగర్ శిశుగృహలో పెరుగుతున్న ఏడాదిన్నర పాపను హైదరాబాద్‌కు చెందిన పిల్లలు లేని దంపతులకు అధికారులు దత్తతకు ఇచ్చారు. గురువారం కలెక్టరేట్‌లోని కాన్ఫరెన్స్ హాలులో కలెక్టర్ పమేలా సత్పతి పాపను హైదరాబాద్ దంపతులకు అందజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పిల్లలు లేని దంపతులు చట్టబద్ధమైన దత్తత కోసం జిల్లా సంక్షేమ అధికారి కార్యాలయంలో సంప్రదించాలన్నారు. కార్యక్రమంలో జిల్లా సంక్షేమ అధికారి ఎం సరస్వతి, సీడబ్ల్యూసీ చైర్‌పర్సన్ ధనలక్ష్మి, డీసీపీవో శాంత, పీవో తిరుపతి, శిశుగృహ మేనేజర్ తేజస్వి, సోషల్ వర్కర్ రాజేశ్ పాల్గొన్నారు.

జిల్లా వ్యాప్తంగా మోస్తరు వర్షం

ఉపశమనం పొందిన జనం



తెలంగాణ చౌక్‌లో కురుస్తున్న వర్షం

కరీంనగర్ టౌన్, మే 16: జిల్లావ్యాప్తంగా గురువారం మోస్తరు వర్షం కురిసింది. దీంతో ఒక్కసారిగా వాతావరణం చల్లగా మారింది. రెండు, మూడు రోజులుగా 40 డిగ్రీల ఉష్ణోగ్రతలతోపాటు జనం ఉక్కిరిబిక్కిరి అయ్యారు. ఉదయం ఏడు గంటల నుంచే సూర్యుడు తన ప్రతాపాన్ని చూపాడు. గురువారం సాయంత్రం నాలుగు గంటల వరకు ఎండ వేడి, ఉక్కపోతతో ప్రజలు ఇబ్బంది పడ్డారు. నాలుగు గంటలకు ఒక్కసారిగా వాతావరణం మారింది. ఒక్కసారిగా ఆకాశం మేఘావృతమై వర్షం కురిసింది. కరీంనగర్ జిల్లా కేంద్రంతోపాటు మానకొండూర్, రామడుగు, చొప్పదండి, గంగాధర, కొత్తపల్లి, కరీంనగర్ రూరల్ మండలంలో ఓ మోస్తరు వర్షం కురిసింది. మిగిలిన చోట్ల చిరుజల్లులతోపాటు ఆకాశం మేఘావృతమైంది. వర్షాలు కురుస్తాయని వాతావరణశాఖ హెచ్చరికల నేపథ్యంలో రైతులు అప్రమత్తమై ధాన్యం తడువకుండా జాగ్రత్తలు తీసుకున్నారు.



పిడుగుపాటుకు ఇద్దరు రైతుల మృతి


శ్రీనివాస్, చంద్రయ్య(ఫైల్)

తంగళ్లపల్లి, మే 16: రాజన్న సిరిసిల్ల జిల్లాలో గురువారం సాయంత్రం ఉరుములు, మెరుపులతో కూడిన వర్షంతో పాటు పిడుగులు పడడంతో ఇద్దరు రైతులు మృతి చెందారు. మరో నలుగురు గాయపడ్డారు. తంగళ్లపల్లి మండలం ఇందిరానగర్ గ్రామం భరత్‌నగర్‌కు చెందిన రైతు రుద్రారపు చంద్రయ్య(42) పిడుగు పడి అక్కడికక్కడే మృతి చెందాడు. గురువారం సాయంత్రం తన ఇంటి దగ్గరలోనే ఉన్న పోలంలో రైతు చంద్రయ్య పనులు నిర్వహిస్తుండగా ఒక్కసారిగా ఉరుములు మెరుపులతో పిడుగు మీద పడడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. స్థానిక రైతులు గమనించి అసుపత్రికి తరలించాడానికి ప్రయత్నించగా అప్పటికే మృతి చెందడంతో కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు.

వేములవాడ టౌన్: వేములవాడలో కురిసిన అకాల వర్షానికి పిడుగు పడి ఓ యువ రైతు మృతి చెందిన సంఘటన మున్సిపల్ పరిధిలోని శాత్రాజుపల్లి గ్రామంలో గురువారం సాయంత్రం చోటు చేసుకుంది. గ్రామస్థులు తెలిపిన వివరాల ప్రకారం శాత్రాజుపల్లి గ్రామానికి చెందిన రేగుల దేవయ్య, రేగుల శ్రీనివాస్, కంబళ్ల కొమురవ్వ, కంబళ్ల శ్రీనివాస్, కంబళ్ల ఎల్లయ్యలు చింతచెట్టుకు చింతకాయ కొట్టేందుకు వెళ్లారు. భారీ ఈదురుగాలులతో కూడిన వర్షంతో పిడుగు పడింది. దీంతో కంబళ్ల శ్రీనివాస్ (30) మృతి చెందగా రేగుల దేవయ్య, రేగుల శ్రీనివాస్, కొమురవ్వ, ఎల్లయ్యలు తీవ్రంగా గాయపడ్డారు. హుటాహుటిన వేములవాడని ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. మృతుడికి భార్య, రెండు నెలల పసిబిడ్డ ఉన్నట్లు తెలిపారు.



కరీంనగర్‌లో జోరుగా బైక్ రేస్‌లు

- గంజాయి మత్తులో యువకుల ప్రమాదకర విన్యాసాలు
- ర్యాష్ డ్రైవింగ్‌లతో బెంబేలెత్తుతున్న వాహనదారులు, ప్రజలు

అర్జున్.. నైట్ డ్యూటీ ముగించుకుని నగర శివారులో ఉండే తన ఇంటికి బైక్‌పై వెళుతున్నాడు. ఇంతలో ఓ బైక్ రయ్‌మని అతడి పక్కనుంచి దూసుకుపోయింది.. భయపడ్డ అతను తేరుకునేలోపై మరో బైక్ పెద్ద శబ్దంతో అంతకంటే వేగంగా వెళ్లింది. అలా నాలుగు బైక్‌లు వెళ్లాయి.. అప్పుడు అర్థం అయ్యింది అతడికి అక్కడ బైక్ రేసింగ్ జరుగుతోందని.. కరీంనగర్ శివార్లలోని రోడ్లపై కొందరు యువకులు అర్ధరాత్రి దాటిన బైక్ రేస్‌లు నిర్వహిస్తున్నారు. ప్రమాదకర విన్యాసాలు చేస్తూ ప్రజలను, వాహనదారులను భయాందోళనకు గురి చేస్తున్నారు. కొన్నిసార్లు ప్రమాదాలు జరిగి ప్రాణాలు కోల్పోతున్నారు. పోలీసులు ఈ విషయంపై దృష్టి సారించి చర్యలు తీసుకోవాలని నగరవాసులు కోరుతున్నారు.

ప్రాణాలు తీస్తున్న అతివేగం

బైక్ రేస్‌లలో పాల్గొనే యువకులు ఇటీవల గంజాయి మత్తుకు బానిసలవుతున్నట్లు విమర్శలు వస్తున్నాయి. కొందరు యువకులు రయ్..రయ్..మంటూ ర్యాష్ డ్రైవింగ్, రాంగ్ డ్రైవింగ్, జిగ్‌జాగ్ డ్రైవింగ్‌తో నగరంలోని రోడ్లపై ట్రాఫిక్ సిగ్నల్స్‌ను లెక్కచేయకుండా పక్కనున్న వాహనదారుల గుండెల్లో గుబులురేపుతున్నారు. ఇటువంటి వాహనదారులను పట్టుకోవడం ట్రాఫిక్ పోలీసులకు కూడా కష్టంగా మారింది. అతివేగంగా వాహనాలను నడపటం యువతకు ఒక ప్యాషన్‌గా తయారైంది. ఈ అతివేగమే వారి ప్రాణాల మీదికి వస్తున్నది. అతివేగంతో వాహనాలు నడుపుతున్న యువత ఆ వేగాన్ని నియంత్రించే క్రమంలో ఆందోళనకు గురై సడన్‌బ్రేక్‌లు వేయటం, అడ్డదిడ్డంగా వెళ్లటంతో ప్రమాదాలబారినపడుతున్నారు. కరీంనగర్‌లో అర్ధరాత్రి సమయంలో ర్యాష్ డ్రైవింగ్, అధిక శబ్దంతో వాహనాలను నడపడం ఇటీవలి కాలంలో ఎక్కువగా జరుగుతున్నది. పోలీసులు ఈ విషయంపై దృష్టి సారించాలని నగరవాసులు కోరుతున్నారు.

కరీంనగర్ క్రైం, మే 16: కరీంనగర్‌లో కొందరు యువకులు రాత్రి సమయాల్లో బైక్ రేస్‌లు నిర్వహిస్తూ నగరంలోని ప్రధాన రోడ్లు, నగర శివారులో బైపాస్ రోడ్లపై బైక్ రేస్‌లు జరుగుతున్నాయి. యువకుల ప్రమాదకర విన్యాసాలతో వాహనదారులు, ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు. కరీంనగర్ శివారులోని బొమ్మకల్ బైపాస్‌రోడ్, పెద్దపల్లి ఫ్లైఓవర్ బ్రిడ్జి, రేకుర్తి బైపాస్ రోడ్డు, మానేరు బైపాస్‌రోడ్, ఎల్ఎండీ రిజర్వాయర్ కట్టపై, చింతకుంట-మల్కాపూర్ బైపాస్ రోడ్, విద్యానగర్-శాతవాహన యూనివర్సిటీ రోడ్లపై ఇష్టారాజ్యంగా బైక్ రేసులు జరుగుతున్నాయి.

ప్రమాదాలతో భయాందోళనలు

రెండు రోజుల క్రితం భగత్‌సింగ్ చౌరస్తా నుంచి బైపాస్‌రోడ్‌కు వెళ్లే మార్గంలో బైక్ రేస్‌కు పాల్పడుతున్న యువకుల్లో ఒకరి బైక్ దారిన పోతున్న వాహనాన్ని బలంగా ఢీకొంది. ఈ ప్రమాదంలో బాధితుడి కాలు విరిగి తీవ్ర గాయాలుకాగా యువకులు బైక్‌ను అక్కడే వదిలేసి పరారయ్యారు. బాధితుడికి ఒక ఆసుపత్రిలో శస్త్రచికిత్స జరిగింది. దీనిపై కరీంనగర్ రెండో ఠాణాలో బాధితులు ఫిర్యాదు చేశారు. రాంచంద్రాపూర్ కాలనీ వద్ద బైపాస్ రోడ్‌లో రాత్రి సమయంలో కొందరు యువకులు ఒక గ్యాంగ్‌గా ఏర్పడి గంజాయి సేవిస్తూ నిత్యం బైక్ రేస్‌లు నడుపుతున్నారని స్థానికులు చెబుతున్నారు.

కొందరు యువకులు రోడ్లపై చేస్తున్న ర్యాష్ డ్రైవింగ్, రాంగ్ సైడ్ డ్రైవింగ్, సెల్ డ్రైవింగ్, సడన్‌బ్రేక్, ఓవర్‌టేక్, త్రిబుల్ రైడింగ్‌ల వల్ల వాహనదారులు భయాందోళనలకు గురవుతున్నారు. ఒకరు చేసిన పొరపాటుతో ప్రమాదాలు జరిగి పలువురు ఇబ్బంది పడుతున్నారు. ఎటువంటి తప్పిదం లేని పాదచారులు, వాహనదారులు ఎదుటి వాహనదారుల తప్పిదాలతో ప్రమాదాలబారిన పడుతుండటం ఆందోళనను కలిగిస్తున్నది.

కొద్ది నెలల కిందట చింతకుంట బైపాస్ రోడ్‌లో బైక్ రేస్‌లో పాల్గొన్న యువకులు బైక్ అదుపుతప్పి కిందపడడంతో ఇద్దరు యువకులు అక్కడికక్కడే మృతి చెందారు. అంతకుముందు కరీంనగర్ కోర్టు చౌరస్తా నుంచి బస్టాండ్ వరకు బైక్ రేస్ చేస్తున్న రెండు బైక్‌లు అర్ధరాత్రి సమయంలో రోడ్డు డివైడర్‌ను ఢీకొట్టగా ఇద్దరు అక్కడికక్కడే దుర్మరణం చెందారు. మరొక ప్రమాదంలో మానేరు బైపాస్‌రోడ్‌లో ఒక యువకుడు మృతి చెందాడు. ఇలా తరచుగా ప్రమాదాల బారినపడి యువకులు మృత్యువాత పడుతున్నారు. ఖరీదైన బైక్‌లతో యువకులు బైక్ రేస్‌కు పాల్పడుతూ విలువైన ప్రాణాలను కోల్పోతున్నారు.

లారీ ఢీకొని యువకుడి మృతి

ఐనవోలు, మే 16: లారీ ఢీకొని యువ వ్యాపారి మృతి చెందిన సంఘటన పంథిని శివారు లక్ష్మీపురం స్టేజి వద్ద జాతీయ రహదారి(563)పై గురువారం తెల్లవారుజామున జరిగింది. ఎస్సై అనిల్‌కుమార్ కథనం ప్రకారం కరీంనగర్ జిల్లా హుజూరాబాద్ మండలం సిరిసపల్లి గ్రామానికి చెందిన యువకుడు దిగ్గిశెట్టి వినయ్‌కుమార్(30) వరంగల్ జిల్లా వర్ధన్నపేట మండలం ఇల్లంద గ్రామంలో నివాసం ఉంటూ ఒక కంపెనీ (నిత్యావసర సరుకుల విక్రయ) ఏజెన్సీ డీలర్‌గా వ్యాపారం నిర్వహిస్తున్నాడు. 18 మాసాలుగా ఇల్లందలో ఇల్లు అద్దెకు తీసుకొని ఉంటూ ఆయా మండలాల్లోని గ్రామాల్లో కిరాణం షాపులకు సరుకులు సరఫరా చేస్తున్నాడు. ఐదు రోజుల కిందట తన మేనత్త మృతిచెందగా ఐదవ రోజు కార్యక్రమంలో పాల్గొనేందుకు స్వగ్రామానికి ఉదయం ద్విచక్రవాహనంపై బయలుదేరాడు. వరంగల్ నుంచి ఖమ్మం వైపు వెళ్తున్న లారీ అతివేగంగా ఎదురుగా వచ్చి అదుపుతప్పి వినియ్‌కుమార్ బైక్‌ను ఢీకొట్టడంతో తీవ్రగాయాలైయ్యాయి. ప్రయాణికులు గుర్తించి పోలీసులకు సమాచారం అందించగా అంబులెన్స్ ద్వారా ఎంజీఎంకు తరలించగా చికిత్సపొందుతూ మృతిచెందాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

మెడికల్ షాపు నిర్వాహకుడికి ఏడాది జైలు శిక్ష

కోరుట్ల, మే 16: పట్టణంలో లైసెన్స్ లేకుండా మెడికల్ షాపు నిర్వహిస్తూ మందులు అమ్ముతున్న వ్యక్తికి ఏడాది జైలు శిక్షతో పాటు రూ. 50,000 జరిమాన విధించిన ట్లు గురువారం కోరుట్ల కోర్టు న్యాయమూర్తి జిల్లా డ్రగ్స్ ఇన్స్‌స్పెక్టర్ ఉపేందర్ తెలిపారు. అయన తెలిపిన వివరాల ప్రకారం 2015లో మందులు నిలువ చేసి అమ్మతున్నా డన్న సమాచారంతో పట్టణంలోని శ్రీరామ క్లీనిక్‌పై దాడి నిర్వహించి పలు రకాల మం దులను జప్తు చేసి చేసినట్లు ఆయన తెలిపారు. క్లీనిక్ నిర్వాహకుడు రామ్మోహన్‌పై కేసు నమోదు చేసి కోర్టులో అప్పటి అధికారులు హాజరు పరిచినట్లు ఉపేందర్ తెలిపారు. ప్రాసిక్యూషన్ తరపున ప్రభుత్వ న్యాయవాది మాదవి వాదనలను న్యాయమూర్తి పావని ముందు ఉంచగా డ్రగ్స్ శాఖ అధికారులు పోలీసుల సహకారంతో సాక్షులను కోర్టులో హాజరు పరిచారు. సాక్ష్యాధారా లను పరిశీలించిన పిదప డ్రగ్స్ అండ్ కాస్మెటిక్ చట్ట నిబంధనలకు విరు ద్ధంగా మందులు నిలువ ఉంచి అమ్మి నట్లు రుజువు కావ డంతో నిందితుడు రామ్మోహన్‌కు ఏడాది జైల్ శిక్ష రూ. 50,000 జరిమానా జూనియర్ సివిల్ న్యాయమూర్తి పావని విధించినట్లు తెలిపారు.

పడిపోయిన విద్యుత్ స్తంభాలు

గణేశ్‌నగర్, మే 16: గాలి దుమారానికి కరీంనగర్ టౌన్ డివిజన్ సిరిసిల్ల సబ్ డివిజన్ నాంపల్లి సబ్‌స్టేషన్ పరిధిలో గురువారం విద్యుత్ స్తంభాలు పడిపోయాయి. నాంపల్లి సబ్‌స్టేషన్‌ను ఎస్ఈ వడ్లకొండ గంగాధర్, డీఈ జె రాజం పరిశీలించారు. నాంపల్లి సబ్‌స్టేషన్ 11కెవి, ట్రిప్పింగ్ విషయమై సెస్ మేనేజింగ్ డైరెక్టర్ 11కెవి మెయింటెనెన్స్, అన్ని విషయాలను వివరించారు. గురువారం సాయంత్రం ఈదురు గాలులు, వర్షం వలన నందికమాన్, మర్లపేట 33 కెవి ఫీడర్ యొక్క ఏడు కరెంటు పోల్స్ గాలి దుమారానికి పడిపోయాయి. వాటిని ఎస్ఈ, డీఈ పరిశీలించి పనులను యుద్ధ ప్రాతిపదికన చేయాలని అధికారులను ఆదేశించారు.

ఇద్దరికి తీవ్ర గాయాలు

ఎల్లారెడ్డిపేట, మే 16: ఎల్లారెడ్డిపేట మండలం రాజన్నపేట గ్రామ శివారులో గురువారం రాత్రి ఆటో, ద్విచక్రవాహనం ఎదురెదురుగా ఢీకొన్నాయి. ఈ సంఘటనలో రాజన్నపేటలోకి వ్యక్తి రాణవేణి శంకర్, అల్మాస్‌పూర్ గ్రామాలకు చెందిన ఆటో డ్రైవర్ నేరేళ్ల శ్రీనివాస్‌గౌడ్‌లకు తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రులను మండల కేంద్రంలోని ఓ ప్రవేటు ఆసుపత్రికి తరలించారు. శ్రీనివాస్‌గౌడ్ తన ఆటోలో ప్రయాణీలను ఎక్కించుకుని గొల్లపల్లి నుంచి అల్మాస్‌పూర్ వైపుకు వెళుతున్నాడు. రాజన్నపేటలోని వ్యక్తి రాణవేణి శంకర్ తన బైక్‌పై అటు నుంచి వస్తున్న క్రమంలో ఆటో, బైక్‌లు ఎదురెదురుగా ఢీకొన్నాయి. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నామని పోలీసులు వివరించారు. కాగా రోడ్డుకిరువైపుల ధాన్యం కుప్పలు ఉండడం వల్ల రెండు వాహనాలు ప్రమాదానికి గురయ్యాయని ప్రత్యక్ష సాక్షులు తెలిపారు.

చెరువు మట్టి..పంట పొలాలకు పుష్టి

- భూసారం పెంచుకునేందుకు రైతుల పోటీ - చెరువుల్లో పెరగనున్న నీటి నిల్వ సామర్థ్యం


చెరువులో మట్టి తీస్తున్న ఉపాధిహామీ కూలీలు

కథలాపూర్, మే 16: మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకం కింద చెరువుల్లో పూడిక తొలగింపు ప్రక్రియ వేగవంతంగా కొనసాగుతోంది. ప్రస్తుతం పంటలన్నీ చేతికి రావడంతో భూములు పడావుగా ఉన్న నేపథ్యంలో రైతాంగం పోటీ పడీ చెరువు మట్టిని పొలాల్లో వేసుకుం టున్నారు. ప్రతీ రోజూ ఉదయం చెరువుల్లో ట్రాక్టర్ల జాతర కొనసాగు తోంది. రైతులు తమ పంట పొలాల్లో భూసారం పెంచుకు నేందుకు మట్టిని తరలించుకుంటున్నారు. ఉపాధి హామి అధికార యంత్రాంగం మట్టి తరలింపుపై ప్రత్యేక దృష్టి సారించి రైతులకు మట్టిలో పోషకాల గురించి వివరిస్తున్నారు.

● 8 గ్రామాల్లో..

మండలంలోని కలికోట, కథలాపూర్, పోసానిపేట, గంభీర్‌పూర్, దుంపెట, భూష ణరావుపేట, ఊట్‌పల్లి, దుంపెట గ్రామాల్లోని చెరువుల్లో మట్టి తరలింపు ముమ్మరంగా కొనసాగుతోంది. సుమారుగా 50 వేల క్యూబిక్ మీటర్ల మేర ఇప్పటికే రైతాంగం తమ చేలల్లో మట్టిని తరలించుకున్నారని అధికారులు పేర్కొంటున్నారు. ఏళ్ల తరబడి గుట్టల పైభాగం నుంచి చెట్ల ఆకులు వరద ఉధృతికి కొట్టుకు వచ్చి చెరువుల్లో మురి గిపోయాయి. దీంతో మట్టిలో భూసారం పెంచే పోషకాలు అధి కంగా ఉంటాయని అధి కారులు పేర్కొంటున్నారు. ఈ క్రమంలో రైతులు భారీ సంఖ్యలో ట్రాక్టర్లు ఏర్పాటు చేసుకుని మట్టిని పోసుకుంటున్నారు. పంటల దిగుబడి ఆశించిన రీతిలో రావడానికి ఆస్కారం ఉందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. ఏళ్ళుగా చెత్తా, చెదారంతో పేరుకుపో యిన చెరువుల్లో మట్టి తొలగింపు కారణంగా లోతు పెరుగుతోంది. ఈ పరిస్థితు ల నేపథ్యంలో చెరువుల్లో నీటి నిల్వ సామర్థ్యం పెరిగి భూగర్భ జలాలు పుష్కలంగా పెర గడానికి దోహదం కానుందని రైతులు చెబుతున్నారు.


పొలాల్లో రైతులు వేసుకున్న మట్టి

రైతులు మట్టిని తరలించుకుంటున్నారు..



చెరువు మట్టి వల్ల లాభాలు తెలుసుకున్న రైతులు ఎంతో ఉత్సాహంగా వేకువజామునే ట్రాక్టర్లను లైన్‌లో పెట్టుకుంటున్నారు. ఎండల కారణంగా ఉదయమే పనులు కొనసాగుతున్నందు వల్ల ఉపాధి కూలీలు సైతం అధిక సంఖ్యలో వస్తున్నారు. పోషకాలతో కూడిన మట్టి వల్ల పం టల దిగు బడులు పెరగనున్నాయి. రైతులే స్వచ్ఛం దంగా ముందుకు రావడం శుభపరి ణామం.

- వెగ్యారపు శ్రీధర్, టెక్నికల్ అసిస్టెంట్

రైతులకు అవగాహన కల్పిస్తున్నాం..



అధికారుల సూచన మేరకు ఉపాధి పనుల్లో కూలీల హాజరు శాతాన్ని పెంచుతున్నాం. ప్రతీ దినం కూలీ సగటున రు. 292లు వచ్చే విధంగా మట్టిని తొలగించేందు ప్రణాళి కలు రూపొందించుకున్నాం. అదేవిధంగా మట్టి వల్ల చేకూరు లాభాలను వివరించడం వల్ల పోటీ పడి తమ చేలల్లో చెరువు మట్టి వేసుకుంటున్నారు. కూలీలకు తాగునీరు. ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉంచుతున్నాం.

- బొంగు నడ్పి సత్యనారాయణ, సీనియర్ మేట్

ముస్తాబవుతున్న అంజన్న ఆలయం


ఆలయానికి రంగులు వేస్తున్న సిబ్బంది

- హనుమాన్ జయంతికి అధికారుల ఏర్పాట్లు

మల్యాల, మే 16: పెద్ద హనుమాన్ జయంతి కోసం కొండగట్టు ఆంజనేయ స్వామి ఆలయానికి రంగులు వేస్తున్నారు. ఈ నెల 30 నుంచి జయంతి ఉత్సవాలు నిర్వహించనున్నారు. యేటా హనుమాన్ పెద్ద జయంతి సందర్భంగా అంజన్న ప్రధాన ఆలయంతో పాటు బేతాళుడు, శ్రీరాముల వారి ఉప ఆలయాలకు రంగులు వేస్తుంటారు. దీంతో రెండు రోజులుగా సిబ్బంది రంగులను ఆలయంకు పూసే చర్యలు చేపట్టారు. కాగా ఆలయానికి రంగులు వేసేందుకు రెండు నెలల ముందుగానే ఆలయ అధికారులు టెండర్లు ఆహ్వానిస్తుం టారు. పార్లమెంట్ ఎన్నికల కోడ్ అడ్డంకి రావడంతో టెండర్లు నిర్వహించలేదు. దీంతో రంగుల వేయడం కోసం దేవస్థానం అధికారులు ప్రత్యామ్నయం కోసం పరిశీలించారు. ఆలయానికి రంగుల పూతకు సుమారు రూ. 2లక్షలు అవసరం కాగా రంగుల పూత కోసం కొండపైన దేవస్థానం ఆధ్వర్యంలో టెండర్ల ద్వారా వివిధ దుకాణాలు నిర్వహించే వ్యాపారులను ఆలయ ఈవో చంద్రశేఖర్ సంప్రదించారు. ఆలయానికి రంగుల కోసం ముందుకు రావాలని కోరారు. దీంతో కొండపైన గల దుకాణదారులు రంగులు వేయించడంకు ముందుకు వచ్చారు. ఈ మేరకు రెండు రోజులుగా రంగుల పనులు చేపడుతున్నారు.

ధర్మపురిలో ప్రత్యేక పూజలు


ప్రత్యేక అలంకరణలో ఉత్సవమూర్తులు

ధర్మపురి, మే 16: ధర్మపురి క్షేత్రంలో నాల్గో రోజు గురువారం శ్రీ నృసింహ నవరాత్రోత్సల్లో భాగంగా ప్రత్యేక పూజలు చేశారు. ఉదయం ఆలయ వేద పండితులు బొజ్జ రమేష్‌శర్మ, సామవేద పండితులు ముత్యాలశర్మ తదితర వేదబ్రాహ్మణుల మంత్రోచ్చరణల మధ్య ముఖ్య అర్చకులు నంబి శ్రీనివాసాచారి, అర్చకులు పురుషసూక్త, శ్రీసూక్త, కల్పోక్త, వ్యాసపూర్వక, శోడషోపచార పూజ, సహస్ర నామార్చన, పంచోపనిషత్తులచే రుద్రాభిషేకం కార్యక్రమాలు నిర్వహించారు. దేశంలో దుర్భిక్ష నివారణ కోసం, సువృష్టి ప్రాప్తికై, సకల ఈతి బాధల నివారణ, అనువాహక హోమాలు నిర్వహించారు. సామవేద పారాయణంతో అభిషేక పూజలు, వాస్తు, యోగిని, క్షేత్ర పాలక, నవగ్రహ, సర్వతోభద్ర మండల స్థాపిత దేవతా పూజలు, సహస్ర, వరుణ, కళశ స్థాపన పూజలు చేశారు. అలాగే లోక కల్యాణార్థం లక్ష్మీ నారసింహ, మూల మంత్ర, వరుణ మూల మంత్ర, రుద్ర హోమాలు నిర్వహించారు. భక్తులు స్వామి వారిని దర్శనం చేసుకున్నారు. కార్యక్రమంలో ఆలయ సూపరింటెండెంట్ ద్యావళ్ల కిరణ్ కుమార్, ఉప ప్రధాన అర్చకులు నేరెళ్ల శ్రీనివాసాచార్యులు, ముఖ్య అర్చకులు నంబి శ్రీనివా సాచారి, చిలుకముక్కు రమణాచార్యా, నరసింహమూర్తి, సీనియర్ అసిస్టెంట్ అలువాల శ్రీని వాస్, బొజ్జ సంతోష్‌కుమార్, సంపత్‌కుమార్, రాజగోపాల్ పాల్గొన్నారు.

యునెస్కో సమావేశానికి ఆహ్వానం


కొత్తిరెడ్డి మల్లారెడ్డి

ఓదెల, మే 16: యునెస్కోలో అక్టోబరు 10, 11న నిర్వహించే విద్యాస మావేశానికి ఆహ్వానం అందినట్లు ఓదెల మండలం కొమిరకు చెందిన ఎస్ఆర్ఆర్ ప్రభుత్వ కళాశాల ప్రొఫెసర్ డాక్టర్ కొత్తిరెడ్డి మల్లారెడ్డి తెలిపారు. యూనెస్కో ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్ ఎడ్యుకేషన్ నెట్‌వర్క్‌లో సహకారాన్ని పెంపొందించడం ద్వారా యువత కోసం సమర్థవంతమైన వ్యవస్థాపక విద్య వ్యూహాల రూపకల్పన గురించి ఉజ్బెకిస్తాన్‌లోని తాష్కెంట్‌లో అక్టోబరు 10,11న విద్యా సమావేశం జరగనుంది. ఈ సమావేశానికి ఎంపిక చేస్తూ తనకు యునెస్కో నుంచి ఆహ్వానం అందినట్లు మల్లారెడ్డి తెలిపారు. యునెస్కో సమావేశానికి డా.కొత్తిరెడ్డి మాల్లారెడ్డి ఎంపిక కావడం పట్ల ఎస్ఆర్ఆర్ కళాశాల ప్రిన్సిపాల్ డా.కల్వకుంట రామకృష్ణ, తెలంగాణ ప్రభుత్వ కళాశాలల గెజిటెడ్ అధ్యాపక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డా.కె. సురేందర్‌రెడ్డి, స్టాఫ్ సెక్రెటరీ డా.ఎ. శ్రీనివాస్, జిల్లా బాధ్యులు డా.జి.శ్రీనివాస్ వైస్ ప్రిన్సిపాల్స్ డా.ప్రమోద్‌కుమార్, టి.రాజయ్య అధ్యాపకులు, విద్యా ర్థులు అభినందనలు తెలిపారు.

రూ.7,050 పలికిన పత్తి ధర

జమ్మికుంట రూరల్, మే 16: జమ్మికుంట వ్యవసాయ మార్కెట్లో క్వింటాల్ పత్తి ధర 7,050 రూపాయలు పలికింది. గురువారం మార్కెట్ యార్డుకు తొమ్మిది మంది రైతులు 77క్వింటాళ్ల విడి పత్తి, ఇద్దరు రైతులు రెండు క్వింటాళ్ల గోనె సంచుల్లో విక్రయానికి తీసుకు వచ్చారు. ప్రైవేట్ ట్రేడర్స్ బహిరంగ వేలం పాట ద్వారా గరిష్ఠ ధర 7,050, కనిష్ఠ ధర 5వేల రూపాయలు చెల్లించి పత్తి కొనుగోళ్ల చేపట్టారు.

27 క్వింటాళ్ల రేషన్ బియ్యం పట్టివేత

హుజూరాబాద్ రూరల్, మే 16: అక్రమంగా తరలిస్తున్న 27క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని పట్టుకున్నట్లు టౌన్ సీఐ బొల్లం రమేశ్ గురువారం తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం హుజూరాబాద్ మండలంలోని కందుగుల గ్రామానికి చెందిన బత్తుల ఆకయ్య, గంట అనిల్, నర్రావుల అనిల్ అనే వ్యక్తులు గ్రామాల్లో పీడీఎస్ బియ్యాన్ని ప్రజల వద్ద నుంచి తక్కువ రేటుకు కొనుగోలు చేస్తున్నారు. అలా కొనుగోలు చేసిన పీడీఎస్ బియ్యాన్ని అనంతసాగర్‌లోని కోళ్ల ఫారాలకు తరలిస్తున్నారు. అందులో భాగంగా 27క్వింటాళ్ల పీడీఎస్ బియ్యాన్ని టీఎస్03 యూడీ0406 అనే వాహనంలో అక్రమంగా తరలిస్తున్నారు. పక్కా సమాచారం మేరకు రాంపూర్ గ్రామ శివారులో ఎస్సై సాంబయ్యగౌడ్ సిబ్బందితో పట్టుకున్నారు. పట్టుకున్న పీడీఎస్ బియ్యాన్ని, వాహనాన్ని పోలీస్ స్టేషన్‌కు తరలించామని, అక్రమంగా బియ్యాన్ని తరలిస్తున్న బత్తుల ఆకయ్య, గంట అనిల్, నర్రావుల అనిల్‌లపై కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు టౌన్ సీఐ రమేశ్ తెలిపారు. అక్రమంగా బియ్యం తరలిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

ప్రమాదవశాత్తు రైలు కింద పడి ఒకరి మృతి

పెద్దపల్లిటౌన్, మే 16: ప్రమాదవ శాత్తు రైలు కింద పడి ఓ వ్యక్తి మృతి చెందినట్లు రైల్వే జీఆర్పీ హెడ్ కానిస్టేబుల్ తిరుపతి తెలిపారు. గురువారం సుమారు 25 నుంచి 30 ఏళ్ల యువకుడు పెద్దపల్లి రైల్వేస్టేషన్‌లో గుర్తు తెలియని రైలుబండి ఎక్కబోయి లేదా రైలులో ప్రయాణిస్తుండగా రైలు నుంచి కింద పడిపోయినట్లు భావిస్తున్నట్లు తెలిపారు. మృతుని ముఖము నుజ్జు నుజ్జు కావడంతో గుర్తుపట్టడానికి వీలులేకుండా ఉన్నట్లు తెలిపారు. ఎలాంటి అడ్రస్ ఆధారాలు లభించలేదని, కుడి చేతిపై కాంతమ్మ అని తెలుగులో పచ్చబొట్టు ఉన్నట్లు, మెరున్ రంగు హాఫ్ టీ షర్ట్ , మెరున్ రంగు లోయర్ ప్యాంట్ ధరించి ఉన్నట్లు తెలిపారు. మృతదేహాన్ని గోదావరిఖని ప్రభుత్వాస్పత్రి మార్చురీలో భద్రపర్చినట్లు తెలిపారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టినట్లు తెలిపారు. వివరాలు తెలిస్తే ఫోన్ నెంబరు: 9949304574, 871268604లో సంప్ర దించాలని కోరారు.

చికిత్స పొందుతూ యువకుడి మృతి

కోరుట్ల, మే 16: పట్టణంలోని అయిలాపూర్ రోడ్డులో నివాసం ఉంటున్న ఇందూరి నర్సింహాచారి (25) అనే యువకుడు చికిత్స పొందుతూ మృతి చెందినట్లు ఎస్ఐ కిరణ్ కుమార్ తెలిపారు. పోలీసులు బంధువులు తెలిపిన వివరాల ప్రకారం... నర్సిం హాచారి కుల వృత్తి నిర్వహిస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. కొన్ని రోజుల నుంచి నర్సింహాచారి సరైన పని లేక ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నాడు. రెండు రోజుల క్రితం ఇంట్లో యాసిడ్ తాగి అపస్మారక స్థితిలో పడిపోయి ఉన్నాడు. కుటుంబ సభ్యు లు గమనించి చికిత్స నిమిత్తం కోరు ట్ల ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో మెరుగైన చికిత్స కొసం కరీంనగర్‌కు తరలించింగా చికిత్స పొందుతూ నర్సింహాచారి గురువారం మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. నర్సింహాచారి తండ్రి వెంకటరమణ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ కిరణ్ కుమార్ తెలిపారు.

పీజీ ఫలితాలు విడుదల

గణేశ్‌నగర్, మే 16: శాతవాహన విశ్వవిద్యాలయం పరిధిలో నిర్వహించిన ఎంబీఏ, ఎంసీఏ, ఎమ్మెస్సీ .(ఫిజిక్స్, ఇంజనీరింగ్ ఫిజిక్స్) 3,1వ సెమిస్టర్ మార్చి 2024 పరీక్షల ఫలితాలను గురువారం విడుదల చేసినట్లు శాతవాహన విశ్వవిద్యాలయం పరీక్షల నియంత్రణ అధికారి డాక్టర్ ఎన్ వి శ్రీరంగప్రసాద్ తెలిపారు. విద్యార్థిని విద్యార్థులు ఫలితాలను యూనివర్సిటీ వెబ్‌సైట్ www. satavahana.ac.inలో అందుబాటులో ఉన్నాయని తెలిపారు.

అంతర్జాతీయ వైజ్ఞానిక కార్యక్రమానికి విద్యార్థిని ఎంపిక


ప్రాజెక్టు వివరాలను రాష్ట్రపతికి వివరిస్తున్న విద్యార్థి పూజశ్రీ

పెద్దపల్లి కల్చరల్, మే 16: జిల్లా విద్యార్థిని 9వ జాతీయ ఇన్‌స్పైర్ అవార్డుల పోటీల్లో సత్తాచాటిన జిల్లా విద్యార్థినికి మరో అరుదైన అవకాశం లభించింది. పెద్దపల్లి జిల్లా సుల్తానాబాద్ మండల కేంద్రంలోని అల్ఫోర్స్ ఉన్నత పాఠశాలలో 10వ తరగతి విద్యార్థిని ముస్త్యాల పూజశ్రీ మే 19 నుంచి 25వ తేదీ వరకు జపాన్ రాజధాని టోక్యో వేదికగా ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించే సకూర కార్యక్రమంలో పాల్గొనాలని ఈ మేరకు కేంద్ర శాస్త్ర సాంకేతిక మంత్రిత్వ శాఖ నుంచి విద్యార్థినికి ఆహ్వానం అందినట్లు జిల్లా విద్యాశాఖాధికారి డి.మాధవి తెలిపారు. 2022సెప్టెంబర్ 14 నుంచి 16 వరకు ఢిల్లీలో జరిగిన 9వ జాతీయ ఇన్‌స్పైర్ వైజ్ఞానిక ప్రదర్శనలో రాణించి కేంద్ర శాస్త్ర సాంకేతిక మంత్రి డాక్టర్ జితేంద్రసింగ్ చేతుల మీదుగా పూజశ్రీ అవార్డు అందుకున్నట్లు డీఈవో పేర్కొన్నారు. అలాగే గత ఏడాది ఏప్రిల్ 10న రాష్ట్రపతి భవన్‌లో నిర్వహించిన ఫైన్ కార్యక్రమంలో పాల్గొని ప్రతిభ చాటినట్లు తెలిపారు. జపాన్ సకూర అంతర్జాతీయ వైజ్ఞానిక కార్యక్రమానికి గత ఏడాది నవంబర్‌లో జిల్లాకు చెందిన జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల చందనాపూర్ పదో తరగతి విద్యార్థిని దాసరి హర్షిత ఇప్పటికే ఈ కార్యక్రమంలో పాల్గొన్నట్లు తెలిపారు. జిల్లా నుంచి విద్యార్థి ఎంపిక కావడం పట్ల పూజశ్రీని అలాగే ప్రోత్సహించిన గైడ్ టీచర్ ను డీఈవో డి.మాధవి, జిల్లా సైన్స్ అధికారి బి.రవినందన్ రావులు గురువారం ఒక ప్రకటనలో అభినందించారు.

కళతప్పిన కొత్తపల్లి చెరువు

- అడుగంటిన జలాలతో ఆందోళనలో అన్నదాతలు
- మత్స్యకారులకు ఉపాధి కరువు


నీటిమట్టం తగ్గిన కొత్తపల్లి చెరువు

భగత్‌నగర్, మే 16: ప్రతి ఏటా నిండుకుండలా జలకళ సంతరించుకుని ఉండే కొత్తపల్లి చెరువులో నీరు తగ్గి కళ తప్పింది. ఎండాకాలంలో సైతం మత్తడి దూకిన కొత్తపల్లి చెరువు కళా విహీనంగా తయారైంది. కొత్తపల్లి చెరువు 195 ఎకరాల విస్తీర్ణంలో జల కళతో నిండుకుండలా ఉండాల్సిన చెరువులో నీరు లేక వెలవెలబోతున్నది. వేలాది ఎకరాలకు సాగు నీరు అందించాల్సిన కొత్తపల్లి చెరువు కళావిహీనంగా మారడంతో రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కొత్తపల్లి చెరువులోకి సమీప మండలాలైన బోయినపల్లి, రామడుగు, గంగాధర మండలాల్లోని 29 చెరువులు, కుంటల నుంచి వరద నీరు చేరిపోతుండేది. కాళేశ్వరం నీరు రాకపోవడంతో వరద నీరు లేక కొత్తపల్లి చెరువులోకి నీరు చేరే పరిస్థితి లేకుండా పోయింది. దీనికి తోడు వెలిచాల సమీపంలో నిర్మిస్తున్న బ్రిడ్జి నిర్మాణంతో కాలువల ద్వారా నీరు రాకుండా నిలిపి వేయడంతో కొత్తపల్లి చెరువులోకి నీరు చేరే పరిస్థితి లేకుండా పోయింది. కొత్తపల్లి చెరువు నిండి మత్తడి దూకినప్పుడు వరదనీరు కరీంనగర్ రూరల్ మండలంలోని దుర్శేడ్ వాగులోకి వెళ్తాయి. ఈ ప్రాంతంలోని కొత్తపల్లి చెరువులో నీరు లేక పోవడంతో ఈ ప్రాంతంలో చెరువుపై ఆధారపడి పంటలు పండించే రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. దీనికి తోడు కొత్తపల్లి చెరువు మత్స్యకారులకు సైతం వరప్రదాయినికగా నిలుస్తున్నది. చెరువులో నీరు లేక పోవడంతో చేపలు కూడా లేకుండా పోతున్నాయి. కొత్తపల్లి చెరువు నింపేందుకు ప్రత్యామ్నాయ మార్గాలు అన్వేషించి జల కళ తీసుకు రావాలని ఈప్రాంత వాసులు కోరుతున్నారు.

● కలగానే మిగిలిన మినీ ట్యాంక్‌బండ్

కొత్తపల్లి చెరువును మినీ ట్యాంక్‌బండ్‌గా అభివృద్ధి చేసేందుకు గత ప్రభుత్వం పూనుకున్నా ఆ దిశగా అడుగులు పడలేదు. దీంతో కొత్తపల్లి చెరువును మినీ ట్యాంక్ బండ్ చేయాలనే ఉద్దేశం కలగానే మిగిలిపోయింది. నగరానికి సమీపంలో ఉండడంతో కొత్తపల్లి చెరువును మినీ ట్యాంక్‌బండ్‌గా ఎంపిక చేసి పర్యాటకుల సందర్శనకు అనువుగా తీర్చిదిద్దాలనుకున్నారు. కొత్తపల్లి-మల్కాపూర్ గ్రామాలకు వెళ్లేందుకు బ్రిడ్జి నిర్మాణ పనులు ఇప్పుడిప్పుడే సాగుతున్నాయి. కొత్తపల్లి చెరువును మినీ ట్యాంక్ బండ్‌గా అభివృద్ధి చేయాలని స్థానికులు కోరుతున్నారు.

రైతులపై కేసీఆర్ మొసలి కన్నీరు

- ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి


మాట్లాడుతున్న ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి

సారంగాపూర్, మే,16: మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ పదవి పోయాక రైతులపై మొసలి కన్నీరు కార్చుతున్నారని ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి విమర్శించారు. గురువారం మం డలంలోని లచ్చక్కపేట గ్రామంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేసీఆర్ పార్టీకి క్యాడర్ లేదని బీజేపీకి కుదువ పెట్టారని మం డిపడ్డారు. రాష్ట్రంలో సన్న రకం ధాన్యానికి అధిక డిమాండ్ పెరగడంతో సన్న రకం ఉత్ప త్తులను ప్రోత్సహించేందుకు అదనపు రాయితీ కల్పించి రైతులను ఆర్థికంగా బలోపేతం చేసేందుకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆలోచన చేస్తున్నారని తెలిపారు. ఆనాడు కేసీఆర్ సన్న రకం సాగు చేయాలని రైతులను మోసం చేసిన సంగతిని గుర్తు చేస్తూ ఫైర్ అ య్యారు. రైతుల సంక్షేమం కోరేది కేవలం కాంగ్రెస్ పార్టీయేనన్నారు. ప్రభుత్వం పంపిణీ చేయబడుతున్న బియ్యం వినియోగ దారులు ఎక్కడ వినియోగించడం లేదనే ఉద్దేశ్యంతో వినియోగించుకునేలా ప్రభుత్వం ఆలోచిస్తోందన్నారు. కేసీఆర్ వాస్తవాలను గ్రహించకుండా మాట్లాడుతున్నారని అన్నారు. కేసీఆర్ మూసి వేసిన చక్కెర ఫ్యాక్టరీని పున ప్రారంభిం చేందుకు ప్రభుత్వం చిత్త శుద్ధితో పని చేస్తుందని తెలిపారు. జిల్లాలో మిల్లుల సామర్థ్యం లేక పోవడంతో ఇతర జిల్లాలకు తరలించి రెండు వారాల్లో మొత్తం ధాన్యాన్ని కొనుగోలు చేసేల చర్యలు చేపట్టాలని కలెక్టరు, పౌర సరఫరాల కమిషనర్‌తో మాట్లాడినట్లు తెలిపారు. రైతుల రుణమాఫీ రూ, 2లక్షలు ఏక కాలంలో చేసి ఇచ్చిన మాట నిరుపించుకుంటామని తెలిపారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షులు కోండ్ర రాంచందర్‌రెడ్డి, బేతి శంకర్‌రెడ్డి, రవి, సుధాకర్, బేర మహేష్ తదితరులు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలు చేయాలని
రైతుల రాస్తారోకో


కోనరావుపేట ప్రధాన రహదారిపై ధర్నా చేస్తున్న రైతులు

కోనరావుపేట, మే 16: ధాన్యం కొనుగోలు చేయడంలో జాప్యం జరగడమే కాకుండా కొనుగోలు చేసిన ధాన్యాన్ని తరలించకపోవడంతో కోనరావుపేట మండల కేంద్రంలో రైతులు ధాన్యం బస్తాలతో గురువారం రాస్తారోకో చేశారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ ధాన్యం కొనుగోలు ప్రక్రియ వేగవంతంగా లేకపోవడంతో అకాల వర్షాలతో ఇబ్బందులు పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. కొనుగోలు చేసిన ధాన్యం బస్తాలను లారీల కొరతతో తరలించడం లేద న్నారు. రైతులు ధర్నాకు దిగడంతో వచ్చి పోయే వాహనాలకు ఇబ్బంది కలగడంతో విషయం తెలుసుకున్న కోనరావుపేట ఎస్సై ఆంజనేయులు అక్కడికి చేరుకొని అధికారులతో మాట్లాడి సమస్య పరిష్కరిస్తామని రైతులను ఒప్పించడంతో రాస్తారోకో విరమించారు.

చందుర్తి: ధాన్యం కొనుగోలు చేయాలని కోరుతూ చందుర్తి మండలం జోగాపూర్ గ్రామంలోని గ్రామపంచాయతీ కార్యాలయం ఎదుట గురువారం రైతులు ఆందోళన చేపట్టి, నిరసన వ్యక్తం తెలిపారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ గ్రామంలో ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో స్థలం లేక, పొలాల వద్ద విక్రయించేందుకు నెల రోజుల నుంచి సిద్ధంగా ఉంచినప్పటికీ, కొనుగోలు చేయడం లేదన్నారు. ప్రస్తుతం వర్షాలు కురిసే పరిస్థితి ఉందని, వర్షాలు కురిస్తే పొలాల వద్దకు లారీలు వెళ్లేందుకు ఇబ్బందిగా ఉంటుందన్నారు. లారీలు, గన్నీ సంచుల కొరత లేకుండా వెంటనే ధాన్యం కొనుగోలు వేగవంతం చేయాలని చందుర్తి సింగిల్ విండో ఛైర్మన్ తిప్పని శ్రీనివాస్, వేములవాడ ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్‌ను కోరారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ మ్యాకల పరశురాములు, సింగిల్ విండో డైరెక్టర్ నాగం శ్రీనివాస్, రైతులు తదితరులు పాల్గొన్నారు.



జోగాపూర్ గ్రామపంచాయతీ ఎదుట నిరసన తెలియజేస్తున్న రైతులు

దాడి చేసిన ఇద్దరి అరెస్ట్

గొల్లపల్లి, మే 16: గొల్లపల్లి మండలం గుంజపడుగు గ్రామంలో రెండు కుటుంబాల మధ్య జరిగిన ఘర్షణలో ఓ కుటుంబం పై దాడి చేసి తీవ్రంగా గాయపర్చిన గ్రామానికి చెందిన కల్లెం తిరుపతి, కల్లెం తిరుమలేష్ గురువారం అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై చిర్ర సతీష్ కుమార్ తెలిపారు. గ్రామంలో ఇరు కుటుంబాల మధ్య ఓ ప్రహరీ గోడ విషయంలో జరిగిన గొడవల్లో పలువురికి తీవ్ర గాయాలు కాగా, గ్రామంలో తీవ్ర ఉద్రిక్త పరిస్థితులకు దారితీసి పోలీస్ పికెటింగ్ ఏర్పాటు చేశారు. బాధిత కుటుంబ సభ్యుల పై కర్రలతో దాడి చేసి సమ్మయ్య, పోశయ్య అనే ఇరువురు వ్యక్తుల పై దాడి చేసిన నిందితులను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై తెలిపారు.

పిల్లలపై వీధికుక్క దాడి


గాయపడిన బాలుడు

సిరిసిల్ల రూరల్, మే 16 : పసి పిల్లలపై వీధి కుక్క దాడిచేసి గాయపర్చిన సంఘటన గురువారం సిరిసిల్ల పట్టణంలోని బీవైనగర్‌లో చోటు చేసుకుంది. పట్టణంలో 34 వవార్డు బీవైనగర్‌కు చెందిన మమత- వెంకటేశం దంపతుల కుమారుడు నర్సింగోజ్ లిమ్స్ అనే మూడేళ్ల బాలుడు ఇంట్లో నుంచి బయటకు వస్తున్న క్రమంలో వీధి కుక్క దాడి చేసింది. ఈ దాడిలో బాలుడు తీవ్ర గాయాలకు గురయ్యాడు. గమనించిన కుటుంబసభ్యులు కుక్క బారినుంచి బాలుడిని కాపాడి జిల్లా ఆసుపత్రికి తరలించి చికిత్స చేయిస్తున్నారు. అదే వార్డుకు చెందిన చౌదరం రాజు, సుమలత దంపతుల కుతురు చౌదరపు అద్య అనే చిన్నారిపై కుక్క దాడి చేసి గాయపడర్చడంతో కుటుంబసభ్యులు చిన్నారిని ఆసుపత్రికి తరలించారు. వార్డులో వీధి కుక్కలు చాలా ఉన్నాయని ఇప్పటివరకు 15 మందిపై దాడులు చేసి గాయపరిచాయని వార్డు కౌన్సిల ర్ తెలిపారు. కుక్కల నివారించాలని మున్సిపల్ అధికారులకు పలు మార్లు ఫిర్యాదు చేసినా ఎవరు పట్టించుకోవడం లేదని పేర్కొన్నారు. వార్డులో చిన్నపిల్లలు రోడ్డుపై ఆడుకోవడానికి రావడానికి భయంతో వణికిపోతున్నారని చెబుతున్నారు. ఇప్పటికైనా అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

పిడుగుపాటుకు ఆవు, దూడ మృతి

తిమ్మాపూర్ (మానకొండూర్), మే 16: మండలంలోని పర్లపల్లి గ్రామానికి చెందిన ఏనుగుల మల్లయ్యకు చెందిన ఆవు, దూడ, గురువారం పిడుగుపాటుకు గురై మృతి చెందాయి. ఆవుదూడ మృతి చెందడంతో రైతు మల్లయ్య కుటుంబీకుల రోదనలు మిన్నంటాయి. వీటి విలువ సుమారు లక్షా 25వేలు ఉంటుందని, ప్రభుత్వం ఆదుకోవాలని బాధిత కుటుంబ సభ్యులు విజ్ఞప్తి చేశారు.

గాడిదల పెంపకంపై ఆసక్తి

- సౌందర్య ఉత్పత్తులకు పాల వినియోగం
- లీటరు పాల ధర రూ. 3 నుంచి 5వేలు


చిగురుమామిడిలో గాడిదల కోసం నిర్మించిన షెడ్డు

చిగురుమామిడి, మే 16: మండలంలోని రెండు గ్రామాల్లో గాడిదల ఫామ్‌ల ద్వారా ఉపాధి పొందుతు న్నారు. పెంపకం చేపడుతున్నారు. గరిటడైన చాలు గాడిద పాలు అన్న నానుడిని నిజం చేస్తూ యువకులు ఉపాధి పొందుతూ స్ఫూర్తిగా నిలు స్తున్నారు. మండ లంలోని ఇందుర్తి, చిగురుమామిడి గ్రామాల్లో కొందరు స్నేహితులు కలిసి ఆయా గ్రామాల్లో గాడిదల ఫామ్‌లు ఎర్పాటు చేసి మండలంలోని నిరుద్యోగ యువతకు ఆదర్శంగా నిలుస్తున్నారు. కత్తియానాడీ, అలరీ అనే బ్రీడ్ గాడిదలను చెన్నై, బెంగుళూరు నుంచి కొనుగోలు చేశారు. ఒక్కొ క్క గాడిద ధర 70 వేల నుంచి 2లక్షల రూపాయల వరకు ఉంటుంది. ప్రస్తుతం అ రెండు గ్రామాల్లో ఏర్పాటు చేసిన ఫామ్‌ల్లో 40 పైగ గాడిదలు ఉన్నాయి. వాటిని ప్రతిరోజు గేదెల మాదిరిగానే మేత కోసం తీసుక వెళ్లాలి. ఒక్కొక్క గాడిద అర లీటరు నుంచి లీటరు వరకు పాలు ఇస్తుందని పెంపకందారులు చెబుతున్నారు. పాలను చెన్నై తదితర ప్రాంతాలకు సరఫరా చేస్తున్నామని తెలిపారు. గాడిద పాలను సౌందర్య ఉత్పత్తులకు వినియోగిస్తుం డడంతో మంచి డిమాండ్ ఉంది. లీటరు పాల ధర 3 నుంచి 5 వేల రూపాయల వరకు ఉంటుంది. గాడిదల మేత కోసం దశరథి అనే పచ్చి గడ్డిని పెం చుతున్నారు. గడ్డిని మిషన్ ద్వారా కట్ చేసి గాడిదలకు మేతగా వేస్తారు గాడిదల పాలకు ఇతర దేశాల్లో భలే గిరాకి ఉంటున్నం దున, అధిక పెట్టుబ డులు పెట్టి గాడిదల ఫామ్‌లు ఎర్పాటు చేస్తున్నారు. పాలను నిల్వ చేసేందుకు ఫ్రిడ్జిలు ఏర్పాటు చేశారు. రోజు వారిగా పాలు విక్రయించకుండా కొన్ని లీటర్ల పాలు నిల్వ అయిన తరువాతే సంబంధిత (చెన్నై) వ్యాపారులకు సమాచారం ఇస్తే సిబ్బంది తీసుకెళుతున్నారు.


చిగురుమామిడిలో పెంచుతున్న గాడిదలు

ప్రభుత్వాలు చేయూతనివ్వాలి



గాడిదల పెంపకానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చేయూతనివ్వాలి. గాడిదల కొనుగోలుకు అధికంగా పెట్టుబడి అవసరం ఉన్నందున ప్రభుత్వాలు ఆర్థికంగా చేయూతనిస్తే యువలకు ప్రోత్సహకరంగా ఉంటుంది. గాడిద పాలను ఎగుమతి చేసేందుకు చర్యలు తీసుకుంటే ధర అధికంగా వచ్చే అవకాశం ఉంటుంది.

- వేముల రాము, ఫాం నిర్వాహకుడు

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

గణేశ్‌నగర్, మే 16: :నగరంలో విద్యుత్ మరమ్మతులు, చెట్ల కొమ్మల తొలగింపులో భాగంగా శుక్రవారం ఉదయం 8 గంటల నుంచి 10 గంటల వరకు వివిధ ప్రాంతాలలో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు టౌన్ టు ఏడీఈ సుధీర్ కుమార్ తెలిపారు. ఎన్టీఆర్ విగ్రహం ప్రాంతం, హనుమాన్‌నగర్, ఉజ్వల పార్క్‌ప్రాంతం, ఎల్లమ్మ టెంపుల్, పద్మనగర్, రాంనగర్, మంకమ్మతోట, ఆదిత్య అపార్ట్‌మెంట్ ఏరియా, ఫిష్ మార్కెట్ ఏరియా, సంతోషనగర్, సత్యనారాయణ స్వామి టెంపుల్, సిద్ధార్థ స్కూల్, పారమిత స్కూల్, వాసర హాస్పిటల్ ఏరియాలో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు తెలిపారు. విద్యుత్ వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

ఇసుక ట్రాక్టర్ల పట్టివేత

కరీంనగర్ రూరల్, మే16: ఇసుక అక్రమ రవాణా చేస్తున్న మూడు ట్రాక్టర్లను కరీంనగర్ రూరల్ పోలీసులు పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. గురువారం వేకువ జామున పెట్రోలింగ్‌లో భాగంగా చేగుర్తి మానేరు వాగు నుంచి ఇసుక అక్రమ రవాణా చేస్తున్న ట్రాక్టర్లను ఎస్ఐ శేఖర్, బ్లూకోల్ట్స్ సిబ్బంది పట్టుకున్నారు. అక్రమ రవాణాకు పాల్పడ్డ ట్రాక్టర్లపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

విద్యుత్ సరఫరాలో అంతరాయం లేకుండా చూడాలి



మాట్లాడుతున్న ఎస్ఈ గంగాధర్

గణేశ్‌నగర్, మే16: బ్రేక్ డౌన్ లేకుండా గాలి దుమారాల పట్ల జాగ్రత్తగా ఉండాలని టీఎస్ ఎన్పీడీసీఎల్ ఎస్ఈ గంగాధర్ తెలిపారు. కరీంనగర్ రూరల్ డివిజన్ అలుగునూర్ సబ్ డివిజన్ ఆపరేషన్, మెయింటెనెన్స్ స్టాఫ్‌తో ఏర్పాటు చేసిన సమావేశంలో ఎస్ఈ వడ్లకొండ గంగాధర్ మాట్లాడుతూ ఇన్స్పెక్షన్ ఆఫ్ లైన్స్, డీటీఆర్, విద్యుత్తు ప్రమాదాల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, బ్రేక్ డౌన్లు లేకుండా జాగ్రత్తగా ఉండాలన్నారు. నిరంతరంగా విద్యుత్ సరఫరా చేయాలన్నారు, ఈ కార్యక్రమంలో రూరల్ డీఈ తిరుపతి, ఏఈలు పాల్గొన్నారు.

కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి 'వెలిచాల'ను అభినందించిన సీఎం


వెలిచాల రాజేందర్‌రావును అభినందిస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి

కరీంనగర్ అర్బన్, మే 16: కరీంనగర్ పార్లమెంట్ కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేసిన సీనియర్ కాంగ్రెస్ నాయకులు వెలిచాల రాజేందర్‌రావు గురువారం సీఎం రేవంత్‌రెడ్డిని మర్యాద పూర్వకంగా కలిశారు. హైదరాబాద్‌లోని సీఎం రేవంత్‌రెడ్డిని ఆయన నివాసం కలిసి ప్రత్యేక ధన్యావాదాలు తెలిపారు. ఈ సందర్భంగా వెలిచాల రాజేందర్‌రావును సీఎం అభినందించారు. కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గానికి జరిగిన ఎన్నికల్లో జరిగిన పోలింగ్ తీరు, సరలి గురించి చర్చించారు. పార్లమెంట్ పరిధిలోని ఎమ్మెల్యేలు, ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల ఇన్‌చార్జిలు, స్థానిక నాయకులతో సమన్వయం చేసుకుంటూ గట్టిగా పోరాడారని రాజేందర్‌రావును సీఎం అభినందించారు. ఇదే స్ఫూర్తితో ముందుకు సాగాలన్నారు.

ఉద్యోగ అవకాశాలపై అవగాహన కల్పించడం అభినందనీయం

కరీంనగర్ టౌన్, మే 16: ఉద్యోగావకాశాలపై నిరుద్యోగ యువతకు అవగాహన కల్పించడం అభినందనీయమని జిల్లా చాంబరాఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ అధ్యక్షుడు గౌరిశెట్టి మునీందర్ అన్నారు. గురువారం నగరంలోని ఓ ప్రైవేట్ హోటల్‌లో ఈనెల 14 నుంచి 16 వరకు యూత్ 4 జాబ్స్ ఫౌండేషన్, చాంబరాఫ్ కామర్స్ సహకారంతో నిర్వహించిన మొబిలైజేషన్ క్యాంపులు, జాబ్ డ్రైవ్ ఈవెంట్ ప్రోగ్రామ్స్ ముగింపు కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై నిర్వాహకులను అభినందించారు. ఈకార్యక్రమంలో సీఏ వి.హరీష్, వైశ్య భవన్ డైరెక్టర్ లక్ష్మీనారాయణ, టవర్ సర్కిల్ ఆర్యవైశ్య అభ్యుదయ సంఘం అధ్యక్షుడు సామ లక్ష్మన్, వాసవీ క్లబ్ డైరెక్టర్ అంజనీప్రసాద్, సతీష్ తదితరులు పాల్గొన్నారు. యూత్ 4 జాబ్ హెచ్‌వో బృందం పక్షాన మైక్రో ఎంటర్‌ప్రైజ్ ప్రాజెక్టు లీడ్ శ్రావణ్‌కుమార్, ఎండి.షాహెద్ తదిత రులు హాజరై డిగ్రీలోపు, డిగ్రీ పూర్తిచేసిన నిరుద్యోగ యువతకు ఉద్యోగావకాశాలపై అవగాహన కల్పించారు.

బీఆర్ఎస్ ఆధ్వర్యంలో నిరసన


హుజూరాబాద్‌లో నినాదాలు చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు

హుజూరాబాద్, మే 16: హుజూరాబాద్ పట్టణంలోని ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి నివాసంలో కాంగ్రెస్ ప్రభుత్వం రైతులకు రూ. 500 బోనస్ ఇస్తామని చెప్పి ఇవ్వకుండా మోసం చేయడాన్ని నిరసిస్తూ గురువారం బీఆర్ఎస్ నాయకులు నిరసన, ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. కార్యక్రమంలో జడ్పీ చైర్‌పర్సన్ కనుమల్ల విజయ, బండ శ్రీనివాస్, వర్ధినేని రవీందర్‌రావు, బక్కారెడ్డి, ప్రతాప్‌రెడ్డి, అయిలయ్య, కిరణ్, ఎల్లయ్య పాల్గొన్నారు.

మానకొండూర్: రాష్ట్రప్రభుత్వం రైతులను మోసం చేస్తోందని మాజీ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ ఆరోపించారు. మానకొండూర్‌లోని తహసీల్దార్ కార్యాలయం ఎదుట నియోజకవర్గంలోని బీఆర్ఎస్ నాయకులు గురువారం ఆందోళన చేపట్టారు. అనంతరం నాయబ్ తహసీల్దార్ సమ్మయ్యకు వినతి పత్రం సమర్పించి మాట్లాడారు. ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికలలో అమలు కాని హామీలతో గద్దెనెక్కిన రాష్ట్రప్రభుత్వం రైతులు పండించిన క్వింటాల్ ధాన్యానికి రూ. 500 బోనస్ చెల్లించడం లేదన్నారు. అరుగాలం కష్టపడి పండించిన దాన్యాన్ని కొనుగోలు చేయక రైతుల జీవితాలతో చెలగాటం ఆడుతుందన్నారు. కొనుగోలు కేంద్రాలలోని ధాన్యం అకాల వర్షాలకు తడిసిపోతున్నా నిర్వహకులు తూకం వేయడం లేదని ఆయన ఆరోపించారు. ఆరు గ్యారంటీల పేరుతో అధికారం చేపట్టిన రాష్ట్రప్రభుత్వం ఆరు నెలలోనే ప్రజాగ్రహానికి గురి అవుతుందన్నారు. వచ్చే ఖరీఫ్ పంట నుంచి సన్న రకానికి మాత్రమే రూ. 500 బోనస్ చెల్లిస్తామని సీఎం రేవంత్‌రెడ్డి మాట్లాడడం సరైంది కాదన్నారు. రైతులకు బోనస్ చెల్లించేంత వరకు బీఆర్ఎస్ ఆధ్వర్యంలో ఆందోళన కార్యక్రమాలు చేపడతామని ఆయన హెచ్చరించారు. కార్యక్రమంలో జడ్పీటీసీ తాల్లపల్లి శేఖర్‌గౌడ్, వివిద మండలాల అధ్యక్షులు గంప వెంకన్న, మహిపాల్‌రెడ్డి, మాజీ మండల అధ్యక్షులు శాతరాజ్ యాదగిరి, నాయకులు పాల్గొన్నారు.

చొప్పదండి: అబద్ధాలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం మరోసారి రైతులను మోసం చేసే కుట్ర చేస్తుందని మాజి ఎమ్మెల్యే సుంకె రవి శంకర్ అన్నారు. సన్న వడ్లకే 500బోనస్ ఇస్తామన్న కాంగ్రెస్ ప్రభుత్వంకు వ్యతిరేకంగా చొప్పదండిలో గురువారం నిరసన కార్యక్రమాలు చేపట్టారు. అనంతరం తహసీల్దార్‌కు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

సోషల్ మీడియా కోఆర్డినేటర్‌కు ముఖ్యమంత్రి అభినందన

వీణవంక, మే 16: మండలంలోని చల్లూరు గ్రామానికి చెందిన అబ్దుర్ రెహ్మాన్ అన్సారిని గురువారం ముఖ్యమంత్రి రేవత్‌రెడ్డి అభినందించారు. యూత్ కాంగ్రెస్‌లో సోషల్ మీడియా స్టేట్ కో ఆర్డినేటర్‌గాఅబ్దుర్ రెహ్మాన్ అన్సారి చురుగ్గా పని చేస్తున్నారు. అసెంబ్లీ, లోక్‌సభ ఎన్నికలలో సోషల్ మీడియా వేదికగా పార్టీ బలోపేతానికి కృషిచేసినందుకు గురువారం హైదరాబాద్‌లో అబ్దుల్ రెహ్మాన్ అన్సారి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని మర్యాద పూర్వకంగా కలువగా ఆయన అభినందించారు.

శాతవాహన యూనివర్సిటీకి బీసీ వీసీని నియమించాలి


మాట్లాడుతున్న బీసీ సంఘాల నాయకులు

సుభాష్‌నగర్, మే 16: శాతవాహన యూనివర్సిటీకి బీసీ సామాజిక వర్గానికి చెందిన వైస్ చాన్స్‌లర్‌ను నియమించాలని బీసీ కులాల ఐక్యవేదిక, శాతవాహన యూనివర్సిటీ ప్రొటెక్షన్ అండ్ డెవలప్ మెంట్ ఫోరం కో ఆర్డినేటర్ పెండాల శ్రీనివాస్, బీసీ సంఘం ప్రధాన కార్యదర్శి కేశిపెద్ది శ్రీధర్ రాజు కోరారు. గురువారం నగరంలోని ప్రెస్‌భవన్‌లో విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ గత బీఆర్ఎస్ ప్రభుత్వం యూని వర్సిటీలను నిర్లక్ష్యం చేసిందని ఆరోపించారు. రాష్ట్రంలో ఉన్న విశ్వవిద్యాలయాలకు వెంటనే వైస్ చాన్స్‌లర్లను నియమించాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. 2008లో నాటి కాంగ్రెస్ ప్రభుత్వం శాతవాహన యూనివర్సిటీని ఏర్పాటు చేసిందని తెలిపారు. అపుడు మైనారిటీ వర్గానికి చెందిన ఇక్బాల్ అలీని, 2012లో ఓసీ సామాజిక వర్గానికి చెందిన కడారు వీరారెడ్డిని వైస్ చాన్స్‌లర్‌గా నియమించిందన్నారు. 2021లో ఎస్సీ సామాజిక వర్గానికి చెందిన ప్రొఫెసర్ మల్లేశ్‌ను వైస్ చాన్స్‌లర్‌గా నియమించిందన్నారు. ఇంతవరకు యూనివర్సిటీకి బీసీ సామాజిక వర్గానికి చెందిన వైస్ చాన్స్‌లర్ రాలేదన్నారు. ప్రస్తుత వీసీ మల్లేశ్ అవినీతి, అక్రమాలపై విజిలెన్స్ విచారణ జరిపించాలని కోరారు.

రాష్ట్రంలో ఉన్న బీసీ జనాభా ప్రాతిపదికన 50 శాతానికి పైగా వైస్ చాన్స్‌లర్‌లను నియమించాలన్నారు. బీసీలను వైస్ చాన్స్‌లర్లుగా నియమించాలని ప్రభుత్వానికి వారు విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశంలో జిల్లా అధ్యక్షుడు నాగుల కనకయ్య, సిరిసిల్ల రాజేశ్, బీసీ విద్యార్థి సంఘం అధ్యక్షుడు నారోజు రాకేశ్, ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు బోయిని ప్రశాంత్, గాజా ప్రజ్వల్, జాగిరి సాగర్, కోట శ్యామ్‌కుమార్, అన్నమల్ల సురేష్, రవీంద్రాచారి తదితరులు పాల్గొన్నారు.

క్రీడా శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి

కరీంనగర్ స్పోర్ట్స్, మే 16: వేసవి బాస్కెట్ బాల్ క్రీడా శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని ట్రాన్స్‌కో ఎస్ఈ గంగాధర్ అన్నారు. కరీంనగర్ విద్యుత్ శాఖ ఆద్వర్యంలో షూటర్స్, బాస్కెట్ బాల్ అకాడమి జిల్లా కేంద్రంలోని టీఎస్ ఎన్పీడీసీఎల్ కార్యాలయం ఆవరణలో బాస్కెట్‌బాల్ పోటీలు నిర్వహిస్తున్న ఉచిత వేసవి క్రీడా శిక్షణ శిబిరాన్ని ఎస్ఈ గంగాధర్ గురువారం ఉదయం సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన క్రీడాకారులను పరిచయం చేసుకొని మాట్లాడారు. ట్రాన్స్‌కో ఎన్పీడీసీఎల్ ఆద్వర్యంలో ప్రతి వేసవిలో ఉచిత బాస్కెట్‌బాల్ క్రీడా శిక్షణ శిబిరాన్ని నిర్వహిస్తున్నామన్నారు. శిబిరంలో నేర్చుకున్న మెలుకువలతో క్రీడాకారులు రాష్ట్ర, జాతీయ స్థాయికి ఎదగాలన్నారు. కోచ్‌లు సునీల్‌కుమార్, శ్రీధర్‌రావు, జీవన్, సత్యానంద్‌లతో శిబిరాల అభివృద్ధిపై చర్చించారు. సీనియర్ బాస్కెట్‌బాల్ క్రీడాకారుడు టీఎస్ ఎన్పీడీసీఎల్ ఏడి ఈఎల్‌పి రాజు, శిబిరంలో పాల్గొంటున్న క్రీడాకారులకు టీషర్టులను ఉచితంగా అందించగా, ఎస్ఈ గంగాధర్ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో డీఈ విజేందర్‌రెడ్డి, తిరుపతి, రెండవ పట్టణ ఏడిఈ సుధీర్‌కుమార్, అకాడమి వైస్ ప్రెసిడెంట్ అనిల్‌కుమార్, కార్యదర్శి రాజ్‌కుమార్, సీనియర్ క్రీడాకారులు వెంకటేష్, వెంకటరమణ, జాయ్, కృషి తదితరులు పాల్గొన్నారు.

రేపటి నుంచి ఎస్సారార్ అటానమస్ డిగ్రీ సెమిస్టర్ పరీక్షలు

గణేశ్‌నగర్, మే 16: కరీంనగర్ ఎస్సారార్ ప్రభుత్వ ఆర్ట్స్ సైన్స్ కళాశాల (అటానమస్) డిగ్రీ రెండో, నాల్గవ సెమిస్టర్ పరీక్షలు శనివారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు జరగనున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ కల్వకుంట రామకృష్ణ, ఎగ్జామినేషన్స్ కంట్రోలర్ డా.కొత్తిరెడ్డి మల్లారెడ్డి ఒక ప్రకటనలో తెలియజేశారు. కళాశాలలో పార్లమెంట్ నియోజకవర్గం ఓట్ల లెక్కింపు ఉన్నందున పరీక్షలు కళాశాల ఎదురుగా ఉన్న వివేకానంద రెసిడెన్షియల్ స్కూల్‌లో జరగనున్నట్లు విద్యార్థులు గమనించాలని సూచించారు. విద్యార్థులకు ఇప్పటికే హాల్ టికెట్స్ డౌన్ లోడ్ లింక్ పంపించినట్లు తెలిపారు. విద్యార్థులు ఎలాంటి ఆందోళనకు గురికాకుండా ఏకాగ్రతతో చదువుకొని పరీక్షలు రాయాలని కోరారు.

23న వేంకటేశ్వరస్వామి కల్యాణం

కరీంనగర్ కల్చరల్, మే16: దేవాదాయశాఖ పరిధిలోని జిల్లా కేంద్రం మార్కెట్‌రోడ్‌లో గల వేంకటేశ్వరస్వామి దేవాలయంలో ఈ నెల 23న ఉదయం 10-30 గంటలకు అలమేలుమంగా పద్మావతీ సమేత వేంకటేశ్వరస్వామి వార్షిక కల్యాణం నిర్వహిస్తున్నట్లు ఆలయ వ్యవస్థాపక వంశీయ ధర్మకర్తలు చకిలం శ్రీనివాస్, చకిలం గంగాధర్, ఈఓ వుడుతల వెంకన్న ఒక ప్రకటనలో తెలిపారు. అదే రోజున సాయంత్రం 5 గంటలకు సహస్రదీపాలంకరణ సేవ, రాత్రి 6 గంటల నుంచి పుర వీధుల్లో గరుడ వాహనసేవ నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. గరుడ వాహన సేవ ఆలయం నుంచి ప్రారంభమై ప్రకాశం గంజ్ గణపతి ఆలయం వరకు సాగుతుందని తెలిపారు.

అనుమతి లేని శ్రీచైతన్య పాఠశాలను సీజ్ చేయాలి

-ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు కసిరెడ్డి మణికంఠరెడ్డి

భగత్‌నగర్, మే16: నగరంలో అనుమతి లేకుండా ముందస్తు అడ్మిషన్లు చేస్తున్న శ్రీచైతన్య పాఠశాలను సీజ్ చేయాలని ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు కసిరెడ్డి మణికంఠరెడ్డి డిమాండ్ చేశారు. గురువారం నగరంలోని శ్రీచైతన్య పాఠశాల వద్ద ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అనుమతి లేని పాఠశాలను సీజ్ చేయాలని డిఈఓ, ఎంఈవోలకు సమాచారం ఇచ్చినా రాలేదన్నారు. ఎవరూ స్పందించక పోవడంతో సిబ్బందిని బయటకు పంపించి వారితో గేట్‌కి తాళం వేయించామన్నారు. అనుమతులు రాక ముందే ప్రచారం, అడ్మిషన్లు నిర్వహిస్తున్నారన్నారు. జిల్లా వ్యాప్తంగా ప్రైవేట్ పాఠశాలల్లో బీటెక్ ఫీజుల కంటే ఎల్‌కేజీ ఫీజులు అధికంగా ఉన్నాయన్నారు. అడ్మిషన్ల పేరుతో ఐదు వేల నుంచి 20వేల వరకు వసూలు చేస్తున్నారన్నారు. నిబంధనలకు విరుద్ధంగా టెక్నో, ఈ టెక్నో, ఒలంపియాడ్, వరల్డ్ అని హోర్డింగ్స్ ద్వారా విస్తృత ప్రచారం చేస్తున్నా అధికారులు ఎందుకు చర్యలు తీసుకోవడం లేదన్నారు. పాఠశాల ఆవరణలోనే పాఠ్యపుస్తకాలు, యూనిఫామ్స్ అమ్ముతున్నా పట్టించుకోవడం లేదన్నారు. ప్రైవేట్ పాఠశాలలకు వత్తాసు పలుకుతున్న డిఈఓపై చర్యలు తీసుకోవాలని డిమాండ్‌చేశారు. అనుమతి లేని పాఠశాలల పేర్లు విడుదల చేయాలని లేనిచో డిఈఓ ఛాంబర్‌ను ముట్టడిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు వెంకటేష్, మచ్చ రమేష్, జిల్లా కార్యనిర్వాహక కార్యదర్శి హేమంత్, జిల్లా ఉపాధ్యక్షుడు సాగర్, నగర వర్కింగ్ ప్రెసిడెంట్ సునవత్ శ్రీనివాస్ నాయక్, నాయకులు సందీప్ రెడ్డి, వినయ్‌రెడ్డి, శ్రావణ్ పాల్గొన్నారు.

రోడ్డు వేశారు.. డ్రైనేజీ కల్వర్టు మరిచారు

- పాఠశాల ఎదుట మురికి నీటితో విద్యార్థుల ఇబ్బందులు


స్కూల్ ముందు మురికి కాలువలో నిలిచిన నీరు, వర్షానికి నీట మునిగిన స్కూల్ ఆవరణలోని అంగన్‌వాడీ కేంద్రం(ఫైల్)

కరీంనగర్ రూరల్, మే16: నగరంలోని 2వ డివిజన్ వల్లంపహాడ్‌లో కాంట్రాక్టర్ రోడ్డు వేసి డ్రైనేజీకి కల్వర్టు నిర్మించడం మరిచిపోయాడు. దీంతో వల్లంపహాడ్‌లోని మండల పరిషత్ స్కూల్ విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. చిన్నపాటి వర్షానికి స్కూల్ ఆవరణ మొత్తం మురికి నీటితో నిండి కంపు కొడుతోంది. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో కరీంనగర్‌లో విలీనమైన గ్రామాల్లో వల్లంపహాడ్ ఒకటి. అయితే ఇటీవల ఈ గ్రామానికి ప్రధాన రహదారి నిర్మించారు. కాంట్రాక్టర్ మాత్రం రోడ్డుకు ఇరువైపులా ఉన్న డ్రైనేజీకి కల్వర్లు నిర్మించడం మరిచిపోయాడు. దీంతో స్కూల్ ముందర ఉన్న మురికి కాలువ నీరు ఎటుపోని పరిస్థితి నెలకొంది. దీంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. ఈ మురికి నీరు నిలవడం వలన దుర్వాసనతో పాటు, విద్యార్థులు అనారోగ్యపాలవుతున్నారని ప్రధానోపాధ్యాయుడు తెలిపారు. స్కూల్ ముందర భారీ వృక్షాలు పెరగడంతో వర్షాకాలం సమీపిస్తుండటంతో ఉరుములు మెరుపులు, గాలులతో వర్షాలు కురిస్తే కొమ్మలు విరిగి విద్యార్థులకు ఇబ్బంది కలిగే పరిస్థితి నెలకొందని తెలిపారు. అయితే ఈ సమస్యపై పలు సార్లు అధికారులకు విన్నవించడం జరిగిందని, తిరిగి పాఠశాల ప్రధానోపాధ్యాయుడు మనోహర్‌రెడ్డి గురువారం మున్సిపల్ కమిషనర్‌కు పాఠశాల సమస్యలను పరిష్కరించాలని వినతి పత్రం సమర్పించారు. వెంటనే కల్వర్టు నిర్మాణ పనులు చేపట్టి మురికి నీరు నిల్వకుండా చర్యలు చేపట్టాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

పరిసరాల పరిశుభ్రత పాటించాలి

● డిప్యూటీ డీఎంహెచ్‌వో చందు


హుజూరాబాద్‌లో ర్యాలీ నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

హుజూరాబాద్, మే 16: డెంగ్యూ నివారణకు ప్రజలు పరిసరాల పరిశుభ్రత పాటించాలని డిప్యూటీ డీఎంహెచ్‌వో చందు అన్నారు. హుజూరాబాద్ పట్టణంలోని ఏరియా ఆస్పత్రిలో గురువారం జాతీయ డెంగ్యూ దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా డిప్యూటీ డీఎంహెచ్‌వో చందు ఆధ్వర్యంలో ఏరియా ఆస్పత్రి నుంచి అంబేద్కర్ చౌరస్తా వరకు ర్యాలీ చేపట్టారు. కార్యక్రమంలో వైద్యులు రవికుమార్, సాజిద్, రమేశ్ పాల్గొన్నారు.

హుజూరాబాద్ రూరల్: మండలంలోని చెల్పూర్ గ్రామంలో డెంగ్యూ వ్యాధి నివారణకు తీసుకోవల్సిన చర్యలపై ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఇల్లందకుంట: మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యుడు తులసిదాస్ ఆధ్వర్యంలో జాతీయ డెంగ్యూ దినోత్సవం సందర్భంగా వైద్య సిబ్బందితో ర్యాలీ నిర్వహించారు. గురువారం స్థానిక పీహెచ్‌సీ నుంచి మండల కేంద్రంలోని ప్రధాన కూడలి వరకు ర్యాలీ తీశారు. అనంతరం మానవహారంగా ఏర్పడి అందరిపంతం డెంగ్యూ అంతం అంటూ నినాదాలు చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ తులసిదాస్ మాట్లాడుతూ ఎడిస్ దోమకాటు వల్ల డెంగ్యూ వ్యాధి వస్తుందన్నారు. ప్రతి ఒక్కరూ తమ పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని, ఇంట్లోకి దోమలు రాకుండా దోమ తేరలు వాడలని చెప్పారు.. . కార్యక్రమంలో డాక్టర్ కల్యాణ్, డాక్టర్ శ్రీదేవి, హెల్త్ ఆఫీసర్ శ్యామల, హెల్త్ ఎడ్‌కేటర్ మోహన్‌రెడ్డి, సిబ్బంది అనిత, సరళ, సంజీవ్, కుమార్ తదితరులు పాల్గొన్నారు.

జమ్మికుంట రూరల్: జమ్మికుంట మండలం వావిలాల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని ఆరోగ్య ఉప కేంద్రాల వైద్య సిబ్బంది జాతీయ డెంగ్యూ దినోత్సవం సందర్భంగా గురువారం అవగాహన ర్యాలీ చేపట్టారు. ఈ సందర్భంగా వైద్యాధికా రులు మాట్లాడుతూ ఏడిస్ దోమకాటు వల్ల డెంగ్యూ వ్యాధి వస్తుందన్నారు. జ్వరాలు ఎక్కువగా దోమల వల్లే వస్తుంటాయని, వాటిని ఇంట్లోకి రాకుండా దోమ తెరలు వాడాలని సూచించారు. కార్యక్రమంలో ఎంఎల్‌హెచ్‌పి డాక్టర్లు ఫర్హానుద్దీన్, కార్తీక్, మహోన్నత, హిమబిందు, చందన, సంధ్యరాణి, కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ శంకర్‌రెడ్డి, సూపర్వైజర్ రత్నకుమారి, అరుణ, స్వరూప, సదానందం, తదితరులు పాల్గొన్నారు.

వీణవంక: మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్ర సిబ్బంది ర్యాలీ నిర్వహించారు. డెంగ్యూ నివారణ పై ప్రజలకు అవగహన కల్పించారు. కార్యక్రమంలో వెద్య సిబ్బంది పాల్గొన్నారు.

రెండో విడత గొర్రెల పంపిణీ చేపట్టాలి

గంగాధర, మే 16: రెండవ విడత గొర్రెల పంపిణీ చేపట్టాలని అఖిల భారత యాదవ మహా సభ జిల్లా అధ్యక్షుడు నాగారపు సత్యనారాయణయాదవ్ డిమాండ్ చేశారు. గంగాధరలో గురువారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. రెండో విడత గొర్రెల పంపిణీకి జిల్లా వ్యాప్తంగా 2,686 డీడీలు కట్టారని చెప్పారు. అయితే ఆశావాహులకు డబ్బులు వాపస్ ఇస్తామనడం సరైందకాదన్నారు. ఎమ్మెల్యే ఎన్నికల ముందు తప్పకుండా గొర్రెల పంపిణీ కొనసాగిస్తామని, అధికారంలోకి వచ్చాక డబ్బులు ఇస్తామనడం ఏంటని ప్రశ్నించారు. ఇప్పటికైనా ప్రభుత్వం పునరాలో చన చేసి 2686 మంది లబ్ధిదారులకు గొర్రెలను పంపిణీ చేశాయలన్నారు. కార్యక్రమంలో మండలాధ్యక్షుడు ఐలయ్య, ఉమ్మడి జిల్లా ఉపాధ్యక్షుడు రవీందర్‌యాదవ్, రాష్ట్ర కౌన్సిలర్ మల్లేశ్, సందవేని రవీందర్, పర్శరాములు పాల్గొన్నారు.

అకాల వర్షంతో రైతుల ఇబ్బందులు

గంగాధర, మే 16: అకాల వర్షంతో మండలంలో రైతులు ఇబ్బందులు పడ్డారు. కొనుగోలు కేంద్రాల్లో అమ్మకానికి తీసుకువచ్చిన ధాన్యం తడవకుండా రైతులు కుప్పలపై టార్పాలిన్లు కప్పడానికి తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ఉరుములతో కూడిన వర్షం పడటంతో రైతులు ధాన్యం తడుస్తుందని ఆందోళన చెందారు. కేంద్రాలో ఆరిన ధాన్యాన్ని నిర్వహకులు తూకం వేసి మిల్లులకు తరలించాలని రైతులు కోరుతున్నారు.

పాఠశాలను తనిఖీ చేసిన అదనపు కలెక్టర్


వివరాలు తెలుసుకుంటున్న అదనపు కలెక్టర్ ప్రఫుల్‌దేశాయ్

తిమ్మాపూర్(మానకొండూర్), మే 16: మండలంలోని నుస్తులాపూర్ గ్రామంలోని ప్రాథమిక పాఠశాలను అదనపు కలెక్టర్ ప్రఫుల్‌దేశాయ్ గురువారం తనిఖీ చేశారు. అమ్మ ఆదర్శ పాఠశాల పనుల పురోగతిని పరిశీలించారు. ఈ సందర్భంగా ఎంపీడీవోకు పలు సూచనలు చేశారు. ప్రభుత్వ నిబంధనల మేరకు పనులు నిర్వహించి వెంటనే రికార్డు చేసి చెల్లింపులు జరిగేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. పనులు సకాంలో పూర్తి చేసేందుకు చర్యలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో తహసీల్దార్ కనుకయ్య, ఎంపీడీవో విజయ్‌కుమార్, ఎంపీవో కిరణ్‌కుమార్ పాల్గొన్నారు.

కమిటీ నివేదిక అందజేత

జమ్మికుంట, మే 16: హైదరాబాద్‌లోని గాంధీ భవన్‌లో కాంగ్రెస్ పార్టీ అన్ని సెగ్మెంట్లలో పోస్ట్ ఎలక్షన్ ఫీడ్‌బ్యాక్ తెలుసుకునేందుకు కోఆర్డినేటర్స్‌తో కలిసి తెలంగాణ ఇన్‌చార్జి దీపాదాస్ మున్షీ గురువారం సమావేశం నిర్వహించారు. కరీంనగర్ పార్లమెంట్ కోఆర్డినేటర్ మొలుగూరి సదయ్య చేపట్టిన పనులను నివేదిక రూపంలో కమిటీకి అందజేశారు. కార్యక్రమంలో ఎలక్షన్ మేనేజ్మెంట్ కమిటీ కన్వీనర్, మాజీ ఎమ్మెల్సీ కపిలవాయి దిలీప్‌కుమార్, ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్, మాజీ మంత్రి పుష్పలీల, ఎమ్మెల్సీ రాముల నాయక్, టీపీసీసీ వైస్ ప్రెసిడెంట్ వినోద్‌రెడ్డి, ప్రొఫెసర్ కత్తి వెంకటస్వామి, తదితరులు హజరయ్యారు.

రైతులు జాగ్రత్తలు పాటించాలి

గణేశ్‌నగర్, మే16: పవర్ గ్రిడ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా పరిధి లోని 400 కేవీ విద్యుత్ లైన్ల కింద పంట మిగులును తగులబెట్టవద్దని పవర్ గ్రిడ్ కార్పొరేషన్ చీఫ్ మేనేజర్ పవన్ కుమార్ ఒక ప్రకటనలో రైతులకు సూచించారు. విద్యుత్ లైన్ల కింద పంటలు పండించే రైతులు చేనులో మిగిలిన చెత్తను కాల్చివేసే క్రమంలో మంటలు చెలరేగి ప్రమాదాలు జరిగే అవ కాశం ఉంటుందన్నారు.మనకొండూర్ మండలంలోని అన్నారం, చెంగర్ల, దేవంపల్లి, రంగపేట, పోచంపల్లి, లలితాపూర్, ముంజంపల్లి, పచ్చునూరు, వేగురుపల్లి, వెల్ది గ్రామాలు, చిగురుమామిడిమండలంలోని చిగురుమామిడి, ఇందుర్తి, ముడిమాణిక్యం, ముల్కనూర్, నవాబుపేట, పీచుపల్లి,సుందరగిరి గ్రామాలు, తిమ్మాపూర్ మండలంలోని మల్లాపూర్, మన్నెంపల్లి, పార్లపల్లి, పొలంపల్లి, పోరండ్ల గ్రామాల పరిధిలో విద్యుత్ లైన్ల కింద పంట సాగు చేసే రైతులు ఎక్కువగా ఉన్నారని తెలిపారు. విద్యుత్ లైన్ల కింద మంటలు పెడితే కరెంటు సరఫరాకు అంతరాయం కలుగుతుందని, సమీపంలోని జంతువులు, మానవులకు హాని జరిగే ప్రమాదం ఉందంటున్నారు. రైతులు గమనించి ఎట్టి పరిస్థితుల్లో విద్యుత్ లైన్ల కింద మంటలు పెట్టవద్దని కోరారు.

మజ్జిగ పంపిణీ

కరీంనగర్ రూరల్, మే16: పాదచారుల దాహార్తిని తీర్చేందుకు శ్రీ షిరిడిసాయి భక్త భజన మండలి ఆధ్వర్యంలో తీగలగుట్టపల్లి మాతా మాణికేశ్వరి ఆలయ సమీపంలో చల్లని మజ్జిగ వితరణ కార్యక్రమాన్ని చేపట్టారు. భక్త భజన మండలి గౌరవ అధ్యక్షుడు నలుమాచు చంద్ర శేఖర్ మాట్లాడుతూ ఎనిమిది సంవత్సరాలుగా తమ మండలి ఆధ్వర్యంలో వేసవి కాలంలో ప్రతి గురువారం కరీంనగర్‌లో 200లీటర్ల మజ్జిగను ఉచితంగా అందిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో భజన మండలి సభ్యులు చంద్రశేఖర్, వనజ, ప్రశాంత్, చంద్రమోహన్, తిరుపతి, కైలాస నవీన్, రామచందర్, రాణి, సుముద్రాల చంద్రమౌళి, జంగం రమాదేవి, చరణ్ కుమార్, తరుణ్, శరత్ కుమార్, గంగిశెట్టి సత్యనారాయణ, ఆకాష్, దీరజ్, హన్సిక తదితరులు పాల్గొన్నారు.

తపాల కార్యాలయానికి ఏసీ బహూకరణ

భగత్‌నగర్, మే 16: జిల్లా కేంద్రంలోని ప్రధాన తపాల కార్యాలయానికి కీర్తిశేషులు చిదుర భద్రయ్య రిటైర్డ్ పోస్ట్‌మాస్టర్ జ్ఞాపకార్థం గురువారం ఆయన కుమారుడు చిదుర సురేష్ ఏసిని అందించారు. ఈ కార్యక్రమంలో పోస్ట్ మాస్టర్ పవన్‌కుమార్, డిప్యూటి పోస్ట్‌మాస్టర్ శ్రీధర్, సత్యం, రాజు, ఏజెంట్ల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు రావికంటి కృష్ణకిషోర్, ముప్ప శ్రీనివాసరావు గుప్తా, తడగొప్పుల రవీందర్, జంజిరాల రామకృష్ణ, కుమారస్వామి తదితరులు పాల్గొన్నారు.

24 నుంచి యజ్ఞవరాహక్షేత్రంలో ప్రత్యేక పూజలు

కరీంనగర్ కల్చరల్, మే16: లోక కల్యాణార్థం నగరంలోని యజ్ఞ వరాహక్షేత్రంలో 24, 25, 26 తేదీల్లో వరాహ మూలమంత్ర సుదర్శన మహామంత్ర సహిత, శ్రీరామ షడక్షరీ సంపుటిత సుందరకాండ హోమం నిర్వహిస్తున్నట్లు సర్వవైదిక సంస్థానంట్రస్టు మేనేజింగ్ ట్రస్టీ శ్రీభాష్యం వరప్రసాదశర్మ ఒక ప్రకటనలో తెలిపారు. 24న అంకురార్పణ, సుందరకాండ హవన ప్రారంభం, 25న హవనం కొనసాగింపు, 26న సుదర్శనహోమం, మహాపూర్ణాహుతి ఉంటాయని పేర్కొన్నారు. మూడు రోజుల పాటు సాయంత్రం 6-30 గంటల నుంచి సుందర కాండపై భద్రాద్రి దేవస్థానం స్థానాచార్యులు కెఇ స్థలశాయిస్వామి ప్రవచనం ఉంటుందని తెలిపారు. భక్తులు పాల్గొని తరించాలని కోరారు.

అనారోగ్యంతో రిటైర్డ్ వీడీవో మృతి

హుజూరాబాద్, మే 16: పట్టణంలోని విద్యానగర్‌కు చెందిన రిటైర్డ్ వీడీవో కొల్ల రాజిరెడ్డి (85) అనారోగ్యంతో గురువారం మృతి చెందాడు. రాజిరెడ్డి 40ఏళ్లుగా హుజూరాబాద్ మండల విలేజ్ డెవలప్‌మెంట్ ఆఫీసర్‌గా విధులు నిర్వర్తించి రిటైర్డ్ అయ్యారు. రెండు రోజుల క్రితం రాజిరెడ్డి తీవ్ర అస్వస్థతకు గురై మృతి చెందాడు. రాజిరెడ్డి మృతికి మాజీ మంత్రి ఇనుగాల పెద్దిరెడ్డి, కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి వొడితెల ప్రణవ్ తదితరులు సంతాపం తెలిపారు.

ఇంటర్‌లో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

చిగురుమామిడి, మే 16: మండలంలోని మోడల్ స్కూల్లో ఇంటర్ 2024-2025 గాను ప్రవేశలకు దరఖాస్తులను ఆన్‌లైన్ ద్వారా తీసుకుంటున్నట్లు పాఠశాల ప్రిన్సిపాల్ కొడిమ్యాల శ్రీనివాస్ గురువారం తెలిపారు. పదో తరగతి పాసైన విద్యార్థినీ, విద్యార్థులు వెబ్ సైట్ ద్వారా ఎంపీసీ, బైపీసీ, సీఈసీ, ఎంఈసీ గ్రూపులకు మాత్రమే దరఖాస్తులు చేసుకోవాలని చెప్పారు. ఈనేల 25 వ తేది లోపు వరకు దరఖాస్తులు చేసుకోవాలని సూచించారు. పదో తరగతిలో వచ్చిన మార్కుల ఆధారంగానే ఎంపిక ఉంటుందని తెలిపారు. మండలంలో అర్హుఐన విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

మృతురాలి కుటుంబానికి మాజీ ఎమ్మెల్యే పరామర్శ

శంకరపట్నం, మే 16: శంకరపట్నం మండంలోని ఇప్పలపల్లి గ్రామానికి చెందిన చింతిరెడ్డి రమణారెడ్డి తల్లి ఇటీవల అనారోగ్యంతో మృతి చెందగా బాధిత కుటుంబాన్ని మాజీ ఎమ్మెల్యే ఆరెపల్లి మోహన్ గురువారం పరామ ర్శించారు. ఈ మేరకు ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయన వెంట ఓదెల దేవరాజు, గిట్ల గోపాల్‌రెడ్డి, బొమ్మనేని ఆనందం, శ్రీనివాస్‌రెడ్డి, ఓదెల మహేష్ తదితరులు ఉన్నారు.

రోడ్డు ప్రమాదంలో గాయపడ్డ వారికి పరామర్శ

శంకరపట్నం, మే 16: శంకరపట్నం మండలం తాడికల్ గ్రామంలోని కరీంన గర్-వరంగల్ రహదారిపై బుధవారం జరిగిన ట్యాంకర్ ప్రమాదంలో గాయపడి కరీంనగర్‌లోని ఆదర్శ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న వారిని మాజీ జడ్పీటీసీ బత్తిని శ్రీనివాస్‌గౌడ్, కాంగ్రెస్ పా ర్టీ మండలాధ్యక్షుడు గోపగోని బసవయ్యలు గురువారం పరామర్శించారు. వారి వెంట కాంగ్రెస్ నాయకులు కీసర సంపత్, ప్రవీన్, రాజయ్య తదితరులు ఉన్నారు.

కాంగ్రెస్ నాయకుల సన్మానం

జమ్మికుంట, మే 16: ఇల్లందకుంట మండల నూతన ప్రెస్‌క్లబ్ అధ్యక్షుడిగా ఎన్నికైన జక్కె బాలరాజును జమ్మికుంట మండల యువజన కాంగ్రెస్ నాయకులు అంబాల రాజు గురువారం సన్మానించారు. ఇల్లందకుంట మండల పాత్రికేయుల సమస్యల పరిష్కారంలో ఎల్లప్పుడు ముందుండాలని ఆకాంక్షించారు.

నేత్రదానం

సుభాష్‌నగర్, మే 16: నగరంలోని భగత్‌నగర్‌కు చెందిన దురుముట్ల వీరయ్య(60) మరణించాడు. ఆయన కోరిక మేరకు కుటుంబ సభ్యులు ఆయన నేత్రాలను దానం చేశారు. నేత్ర వైద్యశాల డాక్టర్లతో ఆయన నేత్రాలను సేకరించి హైదరాబాద్‌లోని ఎల్‌వి ప్రసాద్ నేత్ర వైద్యశాలకు పంపించినట్లు లయన్స్‌క్లబ్ నేత్రవైద్యశాల ట్రస్టు బోర్డు మెంబరు కోల అన్నారెడ్డి తెలిపారు.

ఈ కార్యక్రమంలో కుటుంబ సభ్యులతో పాటు డాక్టర్ ఎలగందుల శ్రీనివాస్, ఫుల్లాల శ్యామ్, చర్మల వెంకటేశ్వర్లు, శ్రీనివాస్‌గాంధి, సోమారపు వెంకటేశ్వర్లు, గాలిపెల్లి నాగేశ్వర్, కుమారస్వామి, రవీందర్, మహేశ్, కిషన్, గాజుల సతీష్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.